

సింహారోహణం అవతారంలో బాలాత్రిపురసుందరి

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీ బాలాత్రిపురసుందరి సమేత శ్రీరామ లింగేశ్వరస్వామి దేవాలయంలో అమ్మ వారు మంగళవారం సింహారోహణం అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆ దృశ్యమే ఇది.
- పోర్టు సిటీ(కాకినాడ)

'అల'గైతేనే ఆపొచ్చు!




ఉప్పాడ బీచ్ వద్ద సముద్రపు అలల ఉధృతి.. కోతకు ధ్వంసమైన జియోట్యూబ్, రహదారి (ఫైల్)

ఉప్పాడ బీచ్ అంటే గుర్తుకు వచ్చేది అందమైన నీలి సముద్రం. కానీ అంతకుమించి భయపెట్టే సముద్రపు కోత కూడా. ఏయేటికాయేడు సముద్రం అంతకంతకూ ముందుకు వస్తూ కలవరపెడుతోంది. రానురాను వందల ఎకరాల భూములను తనలో కలిపేసుకుంటోంది. ఇలా ఇప్పటివరకు సముద్రగర్భంలో కరిగిపోయిన భూమి జిల్లాలో 1,360 ఎకరాలు. భవిష్యత్తులో ఈ కోత తీవ్రత మరింత పెరగబోతోందన్న హెచ్చరికలు సైతం భయపెడుతున్నాయి. ఈ నేపథ్యంలో కోతనివారణకు ఎన్‌సీఆర్‌సీ శాస్త్రవేత్తలు ప్రత్యేక అధ్యయనం చేసి నష్టనివారణ ప్రణాళికలు సిద్ధం చేశారు. అందులోభాగంగా ఉప్పాడ వద్ద సముద్ర అలల తీవ్రత తగ్గించేందుకు సముద్రం అడుగు నుంచి ప్రత్యేక కాంక్రీట్ గోడ నిర్మించాలని తేల్చారు. దానిపై టెట్రాపాడ్‌లు, రాళ్లను పేర్చి కోత నుంచి కాపాడే మార్గం సూచించారు. అలాగే దక్షిణం వైపు కొత్తగా ఇసుకతో బీచ్‌ను సృష్టించాలని గుర్తించారు. కాకినాడ డీప్ వాటర్‌పోర్టు డ్రెడ్జింగ్ ద్వారా వెలికితీసే ఇసుకను రెండేళ్లలో కోటి క్యూబిక్ మీటర్ల వరకు తెచ్చి కొత్త ఇసుక తిన్నెలను తీర్చి దిద్దాలని ప్రతిపాదించారు. తద్వారా కోత నివారణ సాధ్యమేనని నిగ్గుతేల్చారు. దీనికి రూ.250 కోట్ల వ్యయవుతుందని అంచనా.

- ఉప్పాడ సముద్రపుకోత నివారణకు పూర్తి స్థాయి ప్రణాళికలు సిద్ధం చేసిన శాస్త్రవేత్తలు
- అలలు అధికంగా ఉన్నచోట ఉత్తరం వైపు సముద్రం అడుగులో కాంక్రీట్, టెట్రాపాడ్‌లతో ప్రత్యేక గోడ
- ఉప్పాడ బీచ్ దక్షిణం వైపు కోటి క్యూబిక్ మీటర్ల ఇసుకతో ఒక కొత్త బీచ్ సృష్టించాలని నిర్ణయం
- కాకినాడ డీప్‌వాటర్ పోర్టు ఏటా డ్రెడ్జింగ్ చేసే ఇసుకంతా తెచ్చి పోగేయాలని ప్లాన్
- కొత్త బీచ్‌ను సృష్టిస్తే కోత తగ్గే అవకాశం
- మొత్తం 12 కిలోమీటర్ల మేర కోత నివారణకు రూ.250 కోట్లతో ప్రత్యేక ప్రణాళిక

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఉప్పాడ అంటే సముద్రం. మత్స్యకారులు. ఇక్కడి నుంచి నిత్యం వందలాది మంది మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్తూ జీవనం సాగిస్తుంటారు. ఇక్కడ వారి నివాసాలన్నీ తీరానికి ఆనుకునే ఉంటాయి. కానీ గడచిన ఇరవై ఏళ్లుగా ఇక్కడ సముద్రం అంతకంతకూ ముందుకు వచ్చేస్తోంది. తుఫాన్లు, అల్పపీడనం సమయాల్లో అయితే ఉప్పాడ తీరంలో సముద్రం అల్లకల్లోలంగా మారుతోంది. రక్షణగోడ కోసం పేర్చిన రాళ్లు సైతం అలల ధాటికి ఎగిరిపడుతూ ఉప్పాడ రోడ్డును ఛిద్రం చేసేస్తున్నాయి. చివరకు ఉప్పాడకు సమీపంలో బ్రిడ్జి పరిసరాల్లో సముద్రం పూర్తిగా ముందుకు వచ్చేసింది. అసలు తీరం అనేదే కనిపించదు. ఇలా ఇప్పటివరకు ఉప్పాడ పరిసరాల్లో సముద్రపు కోత వల్ల ఏకంగా 1,360 ఎకరాలు సముద్ర గర్భంలో కలిసిపోయాయి. రెండు ఆలయాలు, 150 వరకు ఇళ్లు మునిగి పోయాయి. అయితే వాతావరణ మార్పుల ప్రభావంతో భవిష్యత్తులో ఇక్కడ కోత మరింత పెరుగుతుందని శాస్త్రవేత్తలు హెచ్చరించారు. అలాగని సముద్రం ముందుకు వస్తే వేరే చోటకు వెళ్లడానికి మత్స్యకారులు అంగీకరించడం లేదు. చావైనా బతుకైనా ఇక్కడే అంటున్నారు. మరోపక్క తీరానికి ఆనుకుని పచ్చటి పంట పొలాలు వందలాది ఎకరాల్లో విస్తరించి ఉన్నాయి. అనేక పరిశ్రమలు, కంపెనీలు కూడా ఉప్పాడ తీరానికి కూతవేటు దూరంలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఉప్పాడ కోత నివారణకు గతంలో అనేక ప్రయత్నాలు జరిగినా ఏవీ పెద్దగా ఫలించడం లేదు. దీంతో అధికారంలోకి వస్తే శాశ్వత కోత నివారణకు చర్యలు చేపడతామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చింది. దీనికి తగ్గట్లుగానే ప్రభుత్వం అడుగులు వేయడం ప్రారంభించింది. పైగా ఉప్పాడ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నియోజకవర్గం పిఠాపురం పరిధిలోనే ఉండడంతో ఆయన కూడా కోత నివారణకు పరిష్కారం చూపాలని పట్టుదలగా ఉన్నారు. దీంతో కొన్నినెలల కిందట ఉప్పాడ బీచ్‌కోతను అధ్యయనం చేయడానికి నేషనల్ కోస్టల్ రీసెర్చ్ సెంటర్ (ఎన్‌సీఆర్‌సీ) శాస్త్రవేత్తలు వచ్చారు. ఉప్పాడ వద్ద సముద్ర అలల తీవ్రతకు సంబంధించి వేవ్ కరెంట్, సముద్రం అడుగున చోటుచేసుకుంటున్న పరిణామాలన్నింటినీ అధ్యయనం చేసి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశారు. ఉప్పాడ వద్ద దక్షిణం, ఉత్తర దిశల్లో ఎలాంటి చర్యలు చేపట్టాలో డ్రాఫ్ట్ రూపొందించారు.

కొత్త బీచ్ సృష్టించాల్సిందే...

ఉప్పాడ వద్ద సముద్రం అలల తీవ్రత చాలా అధికంగా ఉన్నట్టు తేల్చారు. దీనికి పలు కారణాలు గుర్తించారు. అయితే ఈ అలల తీవ్రతను కొంత తగ్గించగలిగితే కోత బాగా నెమ్మదిస్తుందని అంచనా వేశారు. ఇందుకోసం ఉప్పాడ వద్ద తీరం నుంచి 170మీటర్లలోపు సముద్రంలో అత్యంత బలంగా కాంక్రీట్‌తో నిలువునా గోడ నిర్మించాలని ప్రతిపాదించారు. దీనికి టెట్రాపాడ్‌లు కూడా కలపనున్నారు. టెట్రాపాడ్‌లు మూడు కాళ్ల ఆకారంలో కాంక్రీట్ దిమ్మల్లా చాలా బలంగా ఉంటాయి. వీటిని కాంక్రీట్ గోడపై అమర్చుతారు. ఆపైన మళ్లీ భారీ రాళ్లు పేర్చుతారు. దీనివల్ల ఉప్పాడ వైపు అలల తీవ్రత దాదాపుగా తగ్గుతాయి. దీనివల్ల కోత చాలా నెమ్మదిస్తుంది. అయితే భారీ అలల తీవ్రత తట్టుకుని ఒడ్డు నుంచి 170మీటర్లలోపు సముద్రంలో దీని నిర్మాణం చాలా కష్టంతో కూడుకున్న పని. కానీ ఇది చేస్తే కోత ఆపవచ్చని ప్రతిపాదించారు. అలాగే ఉప్పాడకు దక్షిణంవైపు కాకినాడ నుంచి వచ్చే దారిలో మలుపు వద్ద సముద్రం పూర్తిగా ముందుకు వచ్చేసింది. ఇసుక అనేదే లేదు. ఉప్పాడ రోడ్డును ఆనుకుని పేర్చిన రాళ్లను సముద్ర కెరటాలు దారుణంగా తాకుతున్నాయి. మున్ముందు ఇక్కడ సముద్రం మరింత ముందుకు రాబోతోంది. ఈనేపథ్యంలో ఇక్కడ కొత్త బీచ్‌ను సృష్టించబోతున్నారు. దీనివలన అలల ఉధృతి తగ్గి కోత నెమ్మదిస్తుంది. అయితే ముందుకు వచ్చిన సముద్రం వద్ద బీచ్ సృష్టించడం తేలికైన పని కాదు. అయితే కోత నివారణకు ఇదొక్కటే పరిష్కారం. దీంతో శాస్త్రవేత్తలు మొత్తం అధ్యయనం చేసిన తర్వాత ఓ పరిష్కారం కనుగొన్నారు. ఉప్పాడకు సమీపంలో కాకినాడ డీప్‌వాటర్ పోర్టు ఉంది. నేరుగా భారీ నౌకలు ఈ పోర్టుకు వస్తాయి. అయితే నౌకలు వచ్చే మార్గంలో ఏటా ఇసుక డ్రెడ్జింగ్ చేసి నౌకా మార్గానికి ఇబ్బంది లేకుండా చేస్తారు. అయితే ఇలా డ్రెడ్జింగ్ చేసిన సమయంలో భారీగా ఇసుక వస్తుంది. ఆ ఇసుకను ఇంత కాలం సముద్రంలోనే వేరేచోట పోసేస్తున్నారు. కానీ ఇప్పుడు ఆ ఇసుకంతటిని తెచ్చి ఉప్పాడ దక్షిణం వైపు పోసి కొత్త బీచ్ సృష్టించనున్నారు. ఏడాదికి 50లక్షల క్యూబిక్ మీటర్ల చొప్పున, రెండేళ్లకు కోటి క్యూబిక్ మీటర్ల ఇసుకను తెచ్చి ఇక్కడ డంప్ చేస్తారు. ఒకరకంగా ఇసుక తిన్నెలను సృష్టించి బీచ్ తయారు చేస్తారు. 20 మీటర్ల పొడవునా ఈ కొత్త బీచ్ ఉంటుంది. తద్వారా అలల తీవ్రతను ఇసుక తిన్నెలు అడ్డుకుని కోతను తగ్గిస్తాయని శాస్త్రవేత్తలను తేల్చారు. ఇలా 12 కిలోమీటర్లమేర కోత నివారణ చర్యలు చేపట్టడానికి రూ.250కోట్లు ఖర్చవుతుందని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక పంపారు. ఈ నివేదిక ఇటీవల కేంద్రానికి వెళ్లింది. ప్రపంచబ్యాంకు నిధులతో పనులకు ఆమోదం వచ్చే అవకాశం ఉంది.

కోతను ఆపొచ్చు..



ఉప్పాడ వద్ద అలల తీవ్రతను సూచించే రిప్ కరెంట్ ఎక్కువగా ఉంది. దీని నివారణకు ఉప్పాడకు ఉత్తర, దక్షిణ ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టాలి. ఇప్పటికే కోత నివారణ ప్రణాళికను ప్రభుత్వానికి అందించాం.
- రమణమూర్తి, డైరెక్టర్, నేషనల్ కోస్టల్ రీసెర్చి సెంటర్

డ్వాక్రా సంఘాల పేరుతో బోగస్ రుణాలు

- రూ.16 కోట్లు ఫోర్జరీ సంతకాలతో కాజేశారని కలెక్టర్‌కు ఫిర్యాదు
- పిఠాపురంతోపాటు ఏపీలో విజిలెన్సు విచారణ చేయాలని టీడీపీ పిఠాపురం ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ డిమాండ్
- ఏపీఎం, సీసీలు, వైసీపీ నాయకులు కుమ్మక్కయ్యారని ఆరోపణ



కాకినాడ కలెక్టరేట్‌లో విలేకర్లతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

కలెక్టరేట్(కాకినాడ),అక్టోబరు8: పిఠాపురం నియోజవర్గంలో డ్వాక్రా సంఘాల సభ్యుల పేర్లతో ఇతరులు రూ.16 కోట్లు రుణాలు కాజేశారని పిఠాపురం టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం కలెక్టర్ షాన్‌మోహన్‌కు ఫిర్యాదుచేశారు. పిఠాపురం మండలంలో బి.కొత్తూరు, లక్ష్మీనరసాపురం, విరవ, కోలంక గ్రామాలకు చెందిన డ్వాక్రా సంఘాల సభ్యుల సంతకాలను ఫోర్జరీ చేసి రుణాలు తీసుకున్నారని విమర్శించారు. ఈ కుంభకోణంలో వెలుగు విభాగానికి చెందిన ఈవో, ఏపీఎం, సీసీలు పాత్రతోపాటు బ్యాంకు మేనేజర్లు, వైసీపీ నాయకులు ప్రమేయం ఉందని ఆరోపించారు. డ్వాక్రా సంఘాల్లో కోనసీమ జిల్లా, అల్లూరి సీతారామరాజు జిల్లాల మహిళలు సభ్యులుగా ఉన్నట్టు చూపించారన్నారు. ఫోర్జరీ చేసి రుణాలు తీసుకున్న తర్వాత రుణాల వాయిదాలు చెల్లించపోవడంతో అమాయకులైన అసలైన సభ్యులకు బ్యాంకు నోటీసులు, కోర్టు నోటీసులు వచ్చాయన్నారు. ఈ రూ.16 కోట్ల కుంభకోణంలో వైసీపీ నాయకులు రూ.2 కోట్లు తినేశారని ఆరోపించారు. దీనిపై సమగ్ర విచారణ చేసి దోషులను అరెస్టు చేయడంతోపాటు సొమ్ములు రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. గత ఐదేళ్లలో ఇచ్చిన డ్వాక్రా రుణాలను సమగ్రంగా విజిలెన్సు విచారణ చేస్తే సుమారు రూ.3 వేల కోట్ల కుంభకోణం బయటపడే అవకాశం ఉందన్నారు. దీనిపైన సీఎం చంద్రబాబునాయుడికి కూడా ఫిర్యాదు చేస్తున్నామన్నారు. కాగా తమ సంతకాలు ఫోర్జరీ చేసి రుణాలు తీసుకున్న వారిని కఠినంగా శిక్షించాలని బాధిత డ్వాక్రా సభ్యులు కోరారు.

14 నుంచి పల్లె పండుగ

జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న షాన్‌మోహన్

కలెక్టరేట్ (కాకినాడ), అక్టోబరు 8: రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ఈనెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు జిల్లాలో అన్ని పంచాయతీల్లో పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాల విజయవంతానికి కృషి చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ చెప్పారు. మంగళవారం ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్, పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధిశాఖ డైరెక్టర్ కృష్ణతేజ, ఇతర ఉన్నత స్థాయి అధికారులతో అమరావతి నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఈ కాన్ఫరెన్స్‌కు కలెక్టరేట్ నుంచి కలెక్టర్ షాన్‌మోహన్, జిల్లా పరిషత్, డ్వామా, పంచాయతీ, పంచాయతీరాజ్ శాఖల అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ షాన్‌మోహన్ మాట్లాడుతూ గత ఆగస్టు 23న జిల్లాలో 385 పంచాయతీల్లో ఒకేసారి గ్రామ సభలు నిర్వహించడం జరిగిందన్నారు. అలాగే ఈనెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు నిర్వహించే పల్లెపండుగ పంచాయతీ వారోత్సవాలను జిల్లాలో వివిధ నియోజకవర్గాల ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేస్తూ నిర్వహించేందుకు కృషి చేయడం జరుగుతుందని ఉపముఖ్యమంత్రికి వివరించారు. జిల్లాలో సీసీ డ్రైన్స్, సీసీ రోడ్లు సంబంధించి ఇప్పటికే ప్రతిపాదించిన 70 శాతం పనులు మంజూరు చేయడం జరిగిందన్నారు. గిరిజన ప్రాంతంలో బీటీ రోడ్లు నిర్మాణానికి ప్రతిపాదనలు చేయడం జరిగిందన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో జిల్లా పరిషత్ సీఈవో లక్ష్మణరావు, డ్వామా పీడీ వెంకటలక్ష్మి, జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్, పంచాయతీరాజ్ ఎస్ఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సంఘాల ఎన్నికలకు చర్యలు తీసుకోవాలి : జిల్లా కలెక్టర్

కలెక్టరేట్ (కాకినాడ), అక్టోబరు8: జిల్లాలో సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం అమరావతి రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కాకినాడ కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్, జేసీ రాహుల్ మీనా, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో కలిసి హాజరయ్యారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సూచనల మేరకు నీటి సంఘాల ఎన్నికల సన్నద్ధం కావాలన్నారు. ఆయకట్టు, డిస్ట్రిబ్యూటరీలు, ప్రాజెక్టుల పరిధిలో కొత్తగా వచ్చిన ప్రాంతాలను కలిపి రైతుల ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా రెవెన్యూ అధికారి తిప్పేనాయక్, కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోలు మల్లిబాబు, శ్రీరమణి, ఇరిగేషన్‌శాఖ ఈఈలు తదితరులు పాల్గొన్నారు.

ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు శిక్షణ

జగ్గంపేట, అక్టోబరు 8: పంచాయతీలను ప్రగతి దిశగా తీసుకెళ్లేందుకు పాలక వర్గ సభ్యులు కృషి చేయాలని ఎంపీడీవో ఏవీఎస్ చంద్రశేఖర్ సూచించారు. జగ్గంపేట మండల పరిషత్ కార్యాలయంలో ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు శిక్షణ కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. ఈ శిక్షణా కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఎంఎస్ భాస్కరరావు, గ్రామ కార్యదర్శులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కాకినాడలో టీడీపీ ఎమ్మెల్యే సమావేశం

కాకినాడ సిటీ/కలెక్టరేట్ (కాకినాడ),అక్టోబరు8: కాకినాడలోని జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బుధవారం మధ్యాహ్నం మూడు గంటలకు టీడీపీ ఎమ్మెల్యేల సమావేశం జరుగనుంది. జిల్లాలో ఉన్న టీడీపీ ఎమ్మెల్యేలు దీనికి హాజరవుతున్నారు. ఉభయగోదావరి జిల్లాలు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు నేపథ్యంలో గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదుపై ప్రధానంగా చర్చించనున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యేలు భేటీ అవుతున్నారు.

బాలికపై అత్యాచారం సంఘటనపై విచారణ ముమ్మరం

నిందితుల్ని అదుపులోకి తీసుకున్నాం : ఎస్పీ విక్రాంత్‌పాటిల్



పిఠాపురం పోలీసు స్టేషన్ వద్ద బాలికపై అత్యాచార ఘటనపై మీడియాతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్

పిఠాపురం, అక్టోబరు 8: పిఠాపురం పట్టణంలోని మాధవపురం రోడ్డులో బాలికను ఆటోలో కిడ్నాప్ చేసి అత్యాచారం చేసిన సంఘటనపై పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. పదహారేళ్ల బాలికపై డంపింగ్‌యార్డు వద్ద అత్యాచారానికి పాల్పడిన దుర్గాడ జాన్ అనే వ్యక్తితోపాటు సహకరించిన సుబ్బలక్ష్మి అనే మహిళపై పోలీసులు కేసు నమోదు చేశారు. వీరిపై బీఎన్ఎస్ యాక్టు 65(1), 137(2) సెక్షన్లు, పోక్సో యాక్టు సెక్షన్ 4(2) రెడ్‌విత్ 3,17, జువైనల్ యాక్టు 2015లోని సెక్షన్ 77 కింద కేసులు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. జాన్ టీడీపీ మాజీ కౌన్సిలర్, పట్టణ తెలుగు మహిళ అధ్యక్షురాలి భర్త. కాగా ఎస్పీ విక్రాంత్‌పాటిల్ మంగళవారం సాయంత్రం పిఠాపురం వచ్చి దర్యాప్తు పురోగతిపై ఆరా తీశారు. సంఘటనకు సంబంధించి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నామని, మెజిస్ట్రేట్ ముందు హాజరుపరుస్తామని ఎస్పీ చెప్పారు. కేసుపై పిఠాపురం పట్టణ పోలీసుస్టేషన్‌లో సీఐ శ్రీనివాస్, పట్టణ ఎస్ఐ మణికుమార్‌లతో ఆయన సమీక్షించారు.



పిఠాపురంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

బాధితురాలికి అన్ని విధాలా అండగా ఉంటాం

నిందితుడిని పార్టీ నుంచి సస్పెండ్ చేశాం : పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ

పిఠాపురం, అక్టోబరు8: పిఠాపురం పట్టణ శివారు మాధవపురం రోడ్డులో మైనర్ బాలికపై జరిగిన అత్యాచార సంఘటన అత్యంత బాధాకరమని, దీనికి పాల్పడిన, సహకరించిన వారిపై చర్యలు తీసుకుంటామని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ తెలిపారు. ఆయన మంగళవారం బాలిక కుటుంబసభ్యులను పరామర్శించారు. వారికి అన్ని విధాలా అండగా ఉంటామని చెప్పారు. అత్యాచారం కేసులో నిందితుడైన దుర్గాడ లక్ష్మణ్ అలియాస్ జాన్‌ను టీడీపీ నుంచి సస్పెండ్ చేసినట్టు చెప్పారు. బాధితురాలికి ప్రభుత్వం నుంచి అన్నివిధాలా సహకారం అందజేస్తామని, విషయాన్ని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకువెళుతున్నట్టు చెప్పారు. బాధితురాలికి మెరుగైన వైద్యసేవలు అందేలా చూస్తామన్నారు.

జనసేన నేతల పరామర్శ

పట్టణంలో అత్యాచారానికి గురైన బాలిక కుటుంబ సభ్యులను జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, పలువురు నాయకులు పరామర్శించారు. వారికి కుటుంబానికి అన్నివిధాలా అండగా ఉంటామని తెలిపారు. ఇప్పటికే సంఘటనపై డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అధికారులతో మాట్లాడారని చెప్పారు. కాగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలికను సీపీఎం నాయకులు కుంచే చిన్నా, కోనేటి రాజు, విశ్వనాథం, ఐద్వా నాయకులు కె.మణి, సూర్యనారాయణ తదితరులు పరామర్శించారు. బాధ్యులను కఠినంగా శిక్షించి బాధితురాలికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సంఘటనకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని హ్యూమన్‌రైట్స్ కౌన్సిల్ ప్రతినిధి వెంకటేశ్వరరావు కోరారు. బాలికపై జరిగిన అత్యాచార ఘటన అత్యంత హేయమైనదని వైసీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు వర్ధినీడి సుజాత అన్నారు. ప్రభుత్వం ఈ ఘటనను సీరియస్‌గా తీసుకుని దోషులను శిక్షించాలని, బాధితురాలిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.



శ్రీ మహాలక్ష్మి దేవిగా తలుపులమ్మ

తుని రూరల్, అక్టోబరు 8: శరన్నవరాత్రి పర్వదినాలను పురస్కరించుకుని ప్రసిద్ధి పుణ్యక్షేత్రం లోవ దేవస్థానంలో తలుపులమ్మవారు శ్రీ మహాలక్ష్మిదేవిగా భక్తులను అనుగ్రహించారు. పెద్దఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించారు.

ఫుడ్ అండ్ సేఫ్టీ అధికారులు దాడులు

తునిరూరల్, అక్టోబరు 8: తేటగుంట హైవే హోటల్స్‌లో ఫుడ్ అండ్ సేఫ్టీ అధికారులు దాడులు నిర్వహించారు. ఫుడ్ ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు మాట్లాడుతూ ఆహారనాణ్యతా ప్రమాణాలకు ల్యాబ్‌కు తరలించనున్నట్టు తెలిపారు. నాణ్యతా ప్రమాణాలను నిర్వాహకులు తప్పకుండా పాటించాలని ఆదేశించారు.

బాణసంచా తయారీ కేంద్రాల పరిశీలన

జగ్గంపేట, అక్టోబరు8: జగ్గంపేట, గండేపల్లి మండలాల్లో బాణసంచా తయారీ కేంద్రాలను మంగళవారం పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు పరిశీలించారు. జగ్గంపేట తహశీల్దార్ జేవీఆర్ రమేష్, సీఐ వైఆర్‌కె శ్రీనివాస్, అగ్నిమాపక అధికారులు పాల్గొన్నారు.



ధనలక్ష్మీ నమోస్తుతే

దేవీ శరన్నవరాత్రులు వైభవంగా జరుగుతున్నాయి. ఆరో రోజైన మంగళవారం అమ్మవారు మహాలక్ష్మీ దేవిగా, ధనలక్ష్మిగా దర్శనమిచ్చారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో పలుచోట్ల అమ్మవారిని నోట్ల దండలతో అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని తరించారు.



అరట్లకట్టలో రూ.9 లక్షలతో

కాకినాడ జిల్లా కరప మండలం అరట్లకట్టలోని భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు మహాలక్ష్మీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు కొండేటి సత్యనారాయణమూర్తి, శివశర్మ అమ్మవారికి విశేష పూజలు చేశారు. గ్రామస్తులు, భక్తుల సహకారంతో సమకూరిన రూ.9లక్షలు విలువైన కొత్త కరెన్సీతో అమ్మవారిని, ఆలయ ప్రాంగణాన్ని అందంగా అలంకరించారు.

- కరప

3,33,33,333

అమలాపురంలో శ్రీవాసవి కన్యకాపరమేశ్వరిదేవికి శ్రీమహాలక్ష్మీదేవిగా అలంకరణ

అమలాపురం టౌన్, అక్టోబరు 8: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కోనసీమ జిల్లా అమలాపురం మెయిన్‌రోడ్డులోని శ్రీవాసవికన్యకాపరమేశ్వరిదేవికి మహాలక్ష్మీదేవిగా విశేష అలంకారం జరిపించారు. శ్రీవాసవికన్యకాపరమేశ్వరి వైశ్య సంఘం, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు నంబూరి సత్యనారాయణమూర్తి, కార్యదర్శి నంబూరి నరేష్, కోశాధికారి కొమ్మూరి వెంకటాచలప్రసాద్, ఉత్సవ కమిటీ చైర్మన్ అప్పన వీరన్న, కో-చైర్మన్లు పచ్చిగోళ్ల సోమరాజు, నూలు శ్రీనివాస్ ఆధ్వర్యంలో అమ్మవారి గర్భాలయాన్ని, ఆలయ ప్రాంగణాన్ని రూ.3,33,33,333 నోట్ల దండలతో ప్రత్యేకంగా అలంకరించారు. కరెన్సీ మహాలక్ష్మిని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.



గోకవరంలో రూ.30లక్షలతో

తూర్పు గోదావరి జిల్లా గోకవరం దేవీచౌక్ సెంటర్లో దుర్గాదేవి మంగళవారం ధనలక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు. అమ్మవారిని సుమారు రూ.30లక్షల కరెన్సీతో అలంకరించారు. - గోకవరం



కడియపులంకలో రూ.3లక్షలతో

తూర్పు గోదావరి జిల్లా కడియం మండలం కడియపులంక హరిహర మహాక్షేత్రంలో అపర్ణా దేవి మహాలక్ష్మీదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని రూ.3లక్షల కరెన్సీతో అలంకరించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు మార్గాని సత్యనారాయణ, మాజీ ఎంపీపీ మర్గాని లక్ష్మి దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

- కడియం

లలితాత్రిపురసుందరీ దేవి ఆలంకరణలో

దేవీచౌక్ అమ్మవారు



రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 8: తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం దేవీచౌక్‌లో శ్రీబాలాత్రిపురసుందరీ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను ఉత్సవ కమిటీ వైభవంగా నిర్వహిస్తోంది. మంగళవారం ఉదయం అమ్మవారికి కుంకుమ పూజలు చేసి మంగళ హారతులు ఇచ్చారు. భవానీ మాలధారులు, అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అమ్మవారు శ్రీలలితాత్రిపురసుందరీదేవి అలంకరణలో భక్తులను అనుగ్రహించారు. పలువురు నగర ప్రముఖులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి మోహన్ ఆర్కెస్ట్రా సంగీత విభావరి అలరించింది.



← దేవీచౌక్‌లో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



దేవస్థానం గ్యారేజీలో బస్సులు

కొత్త బస్సులు వచ్చేశాయి

అన్నవరం అక్టోబరు 8: సుదూర ప్రాంతాల నుంచి రైలు, రోడ్డు మార్గాల్లో అన్నవరం చేరుకుని అక్కడి నుంచి కొండపైకి వెళ్లే భక్తుల సౌకర్యార్థం దేవస్థానం రెండు నూతన బస్సులు కొనుగోలు చేసింది. వీటిని మంగళవారం అన్నవరం దేవస్థానం గ్యారేజీకి చేర్చారు. రెండు బస్సులకు సుమారు రూ.85 లక్షలు వ్యయం అయినట్టు అధికారులు వెల్లడించారు. ఈ బస్సులకు ముందు భాగంలో శంఖు, చక్ర, నామాలు... పై భాగంలో సత్యదేవుడి ఆలయ గోపురం నమూనా ఏర్పాటుచేశారు. వీటిని దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డితో ప్రారంభింపచేయాలని అధికారులు ఆలోచన చేస్తున్నారు. దేవస్థానంలో ప్రస్తుతం ఏడు బస్సులున్నాయి. వీటిలో రెండింటిని సత్యగిరి నుంచి రత్నగిరికి ఉచిత సర్వీసుగా తిప్పుతున్నారు. మిగిలిన ఐదింటిలో రెండు తరచూ మరమ్మతులకు గురవుతుండడంతో వాటి స్థానంలో నూతన బస్సులను అందుబాటులోకి తీసుకు రానున్నారు. పాత బస్సుల పర్మిట్‌లను వీటికి మార్చే పనిలో దేవస్థానం రవాణా విభాగం అధికారులు వున్నారు.

విద్యార్థుల ఆలోచనల అభివృద్ధికి... కలల సాకారానికి

జేఎన్టీయూకేలో స్టార్టప్ ఫెస్ట్

జేఎన్టీయూకే, అక్టోబరు 8: సుబు కోట ఫౌండేషన్ సహకారంతో కాకినాడ జేఎన్టీయూ లో నిర్వహిస్తున్న ఇన్నోవేషన్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా అలూమ్ని ఆడిటోరియంలో మంగళవారం స్టార్టప్ ఫెస్ట్-2024 నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఉప కులపతి కేవీఎస్‌జీ మురళీకృష్ణ, విశిష్ట అతిథులుగా ఐక్యూఏసీ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎంహెచ్‌ఎం కృష్ణప్రసాద్, యూసీఈకే ప్రిన్సిపాల్ ఎస్.మోహన్‌రావు పాల్గొన్నారు. క్రాస్ బోర్డర్స్ ఫౌండర్ సుబ్బరాజు అధ్యక్షత వహించగా ప్రతినిధి సిద్దు, వర్సిటీ అధ్యాపకుడు రఘురాం సమన్వయకర్తలుగా వ్యవహరించారు. వీసీ మురళీకృష్ణ మాట్లాడుతూ సుబుకోట ఫౌండేషన్ ద్వారా యూనివర్సిటీలో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ బూట్ క్యాంప్స్, పరిశ్రమల సందర్శన, ఎకో సిస్టమ్ సందర్శన, ఎంపిక చేసిన విద్యార్థుల ఆలోచనలను ప్రయోగాత్మకంగా అభివృద్ధి చేయడానికి ఆర్థిక సహకారం అందించి వారి కలలను సాకారం చేస్తామన్నారు. ఏడాది కాలంగా నిర్వహిస్తున్న కార్యక్రమాల ద్వారా 150 స్టార్టప్‌లలో ఏడు వినూత్న ఆలోచనలను ఎంపిక చేసి విద్యార్థులను ప్రోత్సహించడంతో పాటు వాటిని అభివృద్ధి చేసేందుకు సుబుకోట ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెంటార్లను కూడా నియమించామన్నారు. జేఎన్టీయూకే, అనుబంధ కళాశాలల విద్యార్థులు ఏడు స్టార్టప్‌లను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తమ ఆలోచనలను వివరించారు. కనెక్టింగ్ బ్రెయిన్ విత్ టెక్, రాక్స్ ఎడ్యు ఆల్ట్‌టెక్, ఈఎల్‌ఆర్‌ఎస్, ప్రోగ్రెస్ పాయినీర్స్, ఎనేబుల్డ్ బయోనిక్స్, ద ట్రయిల్ బ్లేజర్స్ గురించి వివరించారు. ఎనేబుల్డ్ బయోనిక్స్ (ప్రథమ), ప్రోగ్రెస్ పాయినీర్స్ (ద్వితీయ), కనెక్టింగ్ బ్రెయిన్ విత్ టెక్ (తృతీయ) స్థానాల్లో నిలిచాయి. సుబుకోట ఫౌండేషన్ ద్వారా వారికి రూ.2.5 లక్షలు, రూ.1.5 లక్షలు, రూ.లక్ష నగదును బహుమతులుగా అందజేశారు. ఐటీ లీడర్, పరిశోధకులు పి.సురేష్, రావా ఏఐ కో-ఫౌండర్ కిరణ్‌బాబు, కృష్ణప్రసాద్ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. మెంటార్లుగా శాతక్, పల్లవ్, హిమజ ప్రాతినిధ్యం వహించగా డైరెక్టర్లు, వైస్ ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో విజేతలకు నగదు బహుమతులు అందజేస్తున్న జేఎన్టీయూకే ఉప కులపతి మురళీకృష్ణ, అతిథులు



సారె తీసుకెళ్తున్న ఈవో రామచంద్రమోహన్, చైర్మన్ రోహిత్

విజయవాడ దుర్గమ్మకు సారె, చీర సమర్పణ

అన్నవరం, అక్టోబరు 8: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా విజయవాడ కనకదుర్గమ్మకు అన్నవరం దేవస్థానం తరపున సారె, చీర, పట్టువస్త్రాలు, మధుర ఫలాలను ఈవో రామచంద్రమోహన్, చైర్మన్ రోహిత్ మంగళవారం అందజేశారు. కనకదుర్గకు సోదరునిగా భావించే సత్యదేవుడి ఆలయం నుంచి పుట్టింటి సారెను అందజేయడం ఆనవాయితీగా వస్తోంది. కార్యక్రమంలో ఏఈవో కొండలరావు, ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యం, అర్చకుడు ఇంద్రగంటి సుధీర్ తదితరులు పాల్గొన్నారు.



బాలికలకు కౌన్సిలింగ్ ఇస్తున్న మహిళా రక్షక్ పోలీసులు

ఇన్‌స్టా ఫ్రెండ్స్... ఇంటి నుంచి పరార్

పసిగట్టిన 'మహిళా రక్షక్' పోలీసులు... తల్లిదండ్రులకు అప్పగింత

రాజమహేంద్రవరం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): నలుగురు బాలికలు ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమయ్యారు... స్నేహం పెరిగింది... ఏమైందో ఏమో గానీ పెద్దవాళ్లకు చెప్పకుండా ఇళ్ల నుంచి వచ్చేశారు. వారి తీరును గమనించిన మహిళా రక్షక్ పోలీసులు పసిగట్టి ఇళ్లకు పంపించారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో మహిళా రక్షక్ టీమ్ సోమవారం రాత్రి పెట్రోలింగ్ చేస్తోంది. ఆర్టీసీ కాంప్లెక్స్‌లో నలుగురు బాలికలు అనుమానాస్పదంగా సంచరిస్తూ కనిపించారు. మెల్లగా వారిని సమీపించి ఆరా తీయగా తాము ఇన్‌స్టాగ్రామ్‌లో స్నేహితులమని చెప్పారు. ఇంట్లో చెప్పకుండా వచ్చేశామని వెల్లడించారు. దీంతో పోలీసులు తల్లిదండ్రులను పిలిపించి బాలికలకు కౌన్సిలింగ్ ఇచ్చి వారితో పంపించారు. మహిళా రక్షక్ ప్రారంభించిన అతి కొద్ది రోజుల్లోనే గుడ్ వర్క్ చేయడంతో ఎస్పీ నరసింహ కిషోర్ ప్రత్యేకంగా అభినందించారు. కాగా ఆ నలుగురు బాలికలతో పాటు ఉన్న మహిళ వారిలో ఒకరి తల్లిగా పోలీసులు చెప్తున్నారు. అసలు ఆ మహిళ ఎవరు? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై ఎస్పీ దృష్టి సారించాల్సి ఉంది.

హత్య కేసులో నిందితుడికి

పదేళ్ల జైలు శిక్ష

తీర్పు ఇచ్చిన కాకినాడ మూడో అదనపు జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి కమలాదేవి

సర్పవరం జంక్షన్, అక్టోబరు 8: కుట్టుమిషన్ చోరీపై గొడవపడి విచక్షణారహితంగా దాడిచేసి హత్యకు పాల్పడ్డ వ్యక్తికి పదేళ్ల జైలు శిక్ష విధించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా కొర్ర గ్రామానికి చెందిన మద్వి జీవనోపాధి కోసం కాకినాడ రూరల్ కొత్తూరులో నివాసం ఉండేవాడు. కుట్టుమిషన్ హెడ్ దొంగతనం విషయమై సింహాద్రి స్వరూప తనతో సహజీవనం చేస్తున్న గుత్తుల శ్రీనుకి చెప్పింది. ఈ విషయమై మద్వి, శ్రీను మధ్య వాగ్వాదం జరిగింది. తర్వాత ఇదే విషయమై జరిగిన గొడవను దృష్టిలో పెట్టుకుని 2023 అక్టోబరు 19న శ్రీనుని మద్వి కర్రతో తలపై విచక్షణారహితంగా కొట్టగా అక్కడికక్కడే మృతి చెందాడు. స్వరూప సింహాద్రి ఫిర్యాదు మేరకు అప్పటి తిమ్మాపురం ఎస్‌ఐ కె.షరీఫ్ కేసు నమోదు చేసి సీఐ కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో దర్యాప్తు చేసి తగిన సాక్ష్యాధారాలతో నిందితుడిపై కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. సాక్షులను విచారించిన తర్వాత నేరం రుజువు కావడంతో కోసి మద్వికి పదేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ కాకినాడ మూడో అదనపు జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి కమలాదేవి తీర్పు ఇచ్చినట్టు తిమ్మాపురం ఎస్‌ఐ ఎంవీవీ రవీంద్రబాబు తెలిపారు. సకాలంలో చార్జిషీట్ దాఖలు చేసి తగిన సాక్ష్యాలతో నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన డీఎస్పీ రఘువీర్‌విష్ణు, సీఐ డీఎస్ చైతన్యకృష్ణ, ఎస్‌ఐ ఎంవీవీ రవీంద్రబాబులను కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ప్రత్యేకంగా అభినందించారు.

వ్యక్తి మృతి కేసులో ముగ్గురి అరెస్టు

వై.రామవరం, అక్టోబరు 8: అడవి జంతువులకు విద్యుత్ తీగలు అక్రమంగా అమర్చిన సంఘటనలో ఓ వ్యక్తి మృతి చెందిన కేసుకు సంబంధించి దేవరమడుగులకు చెందిన ముగ్గురిని అరెస్టు చేసి మంగళవారం కోర్టుకు తరలించినట్టు అడ్డతీగల సీఐ నరసింహమూర్తి, వై.రామవరం ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. దేవరమడుగలకు చెందిన లోతా సూరిరెడ్డి (33) గత నెల 5వ తేదీన ఇంటి నుంచి వెళ్లిపోవడంతో తొలుత మిస్సింగ్ కేసు నమోదు చేశారు. పిట్టల వేటకు వెళ్లిన సూరిరెడ్డి అడవి జంతువుల కోసం అమర్చిన విద్యుత్ తీగలు తగిలి మృతి చెందినట్టు పోలీసుల దర్యాప్తులో తేలింది. ఈ విషయాన్ని గోప్యంగా ఉంచేందుకు పొత్తూరు పండయ్య, పొత్తురు కృష్ణారెడ్డి, కిమ్ముడు బాలురెడ్డి మృతదేహాన్ని పూడ్చిపెట్టి పరారయ్యారు. సీఐ నరసింహమూర్తి దర్యాప్తు చేసి ముగ్గురిని అరెస్టు చేసి కోర్టుకు తరలించారు.

చెడు వ్యసనాలకు బానిసలై చోరీల బాట

» ఇద్దరు నిందితుల అరెస్టు » రూ.8 లక్షలు విలువైన బంగారు, వెండి సామగ్రి స్వాధీనం



నిందితులను, స్వాధీనం చేసుకున్న వస్తువులను చూపిస్తున్న సీఐ ప్రసన్న వీరయ్య గౌడ్

రాజానగరం, అక్టోబరు 8: చెడు వ్యసనాలకు బానిసలై చోరీలకు పాల్పడుతున్న ఇద్దరిని రాజానగరం పోలీసులు అరెస్టు చేశారు. వేర్వేరు దొంగతనం కేసుల్లో అపహరణకు గురైన బంగారు ఆభరణాలతో పాటు వెండి సామగ్రిని నిందితుల నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజానగరం పోలీస్ స్టేషన్లో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో దీనికి సంబంధించిన వివరాలను రాజానగరం సీఐ ఎస్.ప్రసన్న వీరయ్యగౌడ్ వెల్లడించారు. రాజమహేంద్రవరం రూరల్ కొంతమూరు రాజరాజేశ్వరి నగర్‌కు చెందిన బచ్చల గంగ గత నెల 21న కుటుంబ సభ్యులతో కలిసి కాకినాడ జిల్లా శంఖవరం వెళ్లింది. 24వ తేదీన గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తలుపులు పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. తలుపులు తెరిచి ఉండడాన్ని గమనించిన స్థానికులు యజమాని గంగకు ఫోనులో సమాచారం అందించారు. దీంతో ఆమె హుటాహుటిన వచ్చి చూసేసరికి ఇంట్లో భద్రపర్చిన బంగారం, వెండి వస్తువులు అపహరణకు గురైనట్టు గుర్తించి రాజానగరం పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులకు లభించిన ఆధారాల ప్రకారం రాజమహేంద్రవరం రూరల్ వెంకటనగరం గ్రామానికి చెందిన బండి ధర్మరాజు, కొంతమూరు భవానీపురానికి చెందిన వానపల్లి గౌరీశంకర్ అలియాస్ గౌరీష్ అలియాస్ పూలోడులను అనుమానితులుగా గుర్తించారు. వారిని పోలీసులు తమదైన శైలిలో ఎక్కడెక్కడ దొంగతనాలకు పాల్పడ్డారో చిట్టాను వివరించారు. గతంలో రాజానగరం, బొమ్మూరు, కోరుకొండ, గోకవరం పోలీస్ స్టేషన్ల పరిధిలో బంగారు ఆభరణాలు, వెండి వస్తు సామగ్రిని అపహరించిన నేరాలను కూడా అంగీకరించారు. నిందితుల నుంచి 22.41 గ్రాముల బంగారు ఆభరణాలు, సుమారు 2 కిలోల వెండి వస్తువులతో పాటు ఎల్‌ఈడీ టీవీ, రూ.20 వేలు నగదు, రెండు మోటారు సైకిళ్లు, కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసును సత్వరం ఛేదించి, నిందితులను అరెస్టు చేసిన రాజానగరం సీఐ ప్రసన్న వీరయ్య గౌడ్, ఎస్‌ఐ మనోహర్, కానిస్టేబుళ్లను తూర్పు గోదావరి జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ అభినందించారు.

'నన్నయ'లో వచ్చే నెల 7, 8 తేదీల్లో 'ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక వైభవం'పై సదస్సు

దివాన్‌చెరువు, అక్టోబరు 8: ఆది కవి నన్నయ విశ్వవిద్యాలయంలో నవంబరు 7, 8 తేదీల్లో 'ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక వైభవం'పై సదస్సు నిర్వహిస్తున్నామని ఉప కులపతి ఆచార్య వై.శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం ఆయన సంబంధిత బ్రోచర్‌ను ఆవిష్కరించి వివరాలు తెలిపారు. సాంస్కృతిక వైభవం పెంపొందించాలనే లక్ష్యంతో నన్నయ విశ్వవిద్యాలయం ఆర్ట్స్-కామర్స్ ఆంగ్ల విభాగం, సెంటర్ ఫర్ ఆంధ్రప్రదేశ్ స్టడీస్ (విజయవాడ) సంయుక్త ఆధ్వర్యంలో ఈ సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. కన్వీనర్లుగా ఆచార్య కె.శ్రీరమేష్, ఆచార్య డి.జ్యోతిర్మయి, ఎన్.సజనారాజ్ వ్యవహరిస్తున్నారన్నారు. ఈ సదస్సులో ప్రధానంగా మన రాష్ట్ర మౌలిక అస్తిత్వాన్ని ప్రభావితం చేసే అంశాలపై పత్ర సమర్పణలకు ఆహ్వానిస్తున్నామన్నారు. పూర్తి వివరాలను విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌లో పొందుపరిచామన్నారు. సూచించిన రుసుము చెల్లించి ఈ నెల 25వ తేదీలోపు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, పరిశోధనా పత్రాలు సమర్పించాలని కోరారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, కన్వీనర్లు ఆచార్య కె.శ్రీరమేష్, ఆచార్య డి.జ్యోతిర్మయి, సెంటర్ ఫర్ ఆంధ్రప్రదేశ్ స్టడీస్ (కాప్స్) అధ్యక్షుడు, ప్రముఖ మానసిక వైద్యుడు కర్రి రామారెడ్డి, ఓలేటి సత్యనారాయణ పాల్గొన్నారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఉప కులపతి ఆచార్య శ్రీనివాసరావు

అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా నరేష్‌కుమార్

పెద్దాపురం, అక్టోబరు 8: పెద్దాపురం జూనియర్, సీనియర్, జిల్లా కోర్టుల అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ (ఏజీపీ)గా పట్టణానికి చెందిన ప్రముఖ న్యాయవాది కందుల నరేష్‌కుమార్ నియమితులయ్యారు. ఈమేరకు ఆయనకు లీగల్ లెజిస్లేటివ్ ఎఫైర్స్ అండ్ జస్టిస్ రాష్ట్ర కార్యదర్శి నుంచి ఉత్తర్వులు అందాయి. నరేష్‌కుమార్‌కు ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, జనసేన జిల్లా ఇన్‌చార్జ్ తుమ్మల రామస్వామి శుభాకాంక్షలు తెలియజేశారు.

మహాలక్ష్మీగా అమ్మవారి దర్శనం

ఘనంగా దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు, ఆలయాల్లో ప్రత్యేక పూజలు



సామర్లకోటలో బాలాత్రిపుర సుందరి



కొత్తపల్లి: కొమరగిరిలో బాల కనకదుర్గకు కరెన్సీతో అలంకరణ



పెద్దాపురం భువనేశ్వరీ పీఠంలో మహాలక్ష్మీగా భువనేశ్వరీ అమ్మవారు

సామర్లకోట, అక్టోబరు 8: దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆరవరోజైన మంగళవారం సామర్లకోట పంచారామ పుణ్యక్షేత్రమైన సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో బాలాత్రిపురసుందరిఅమ్మవారికి ఆలయ పండితులు సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు, అంజిబాబు, వెంకన్న, వినయ్, వెంకటరమణ, రాజగోపాలశర్మ తదితరులచే వేదమంత్రోచ్ఛారణల మధ్య పుష్పార్చన పూజలు చేసారు. అమ్మవారిని జ్యేష్టనక్షత్రమందు మహాలక్ష్మీగా సర్వాంగసుందరంగా అలంకరించారు. అధికసంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించారు. వేట్లపాలెంలో ప్రసిద్ధి పొందిన భేతాళస్వామి ఆలయంలో విశేష పూజలలో పలువురు భక్తులు అరటిగెలలను అందించి మొక్కుబడులను తీర్చుకున్నారు.

పిఠాపురం: పట్టణంలోని పాదగయ క్షేత్రం కుక్కుటేశ్వరస్వామి సన్నిధిలో వేంచేసి ఉన్న రాజరాజేశ్వరిదేవి, పురుహూతికా అమ్మవార్ల శరన్నవరాత్ర శతచండీయాగ మహోత్సవాల ఆరవ రోజు మంగళవారం విశేష పూజలు జరిగాయి. రాజరాజేశ్వరీదేవి కాళికాదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మహాగణపతి స్వామి వారికి విఘ్నేశ్వరపూజ, కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామికి అభిషేకాలు, రాజరాజేశ్వరీదేవికి ప్రాతఃకాల విశేష సహస్రనామార్చన, కుంకుమార్చనలుజరిగాయి. అష్టాదశ శక్తిపీఠాల్లో దశమశక్తి పీఠానికి అధిష్టాన దేవతయిన పురుహూతికాఅమ్మవారికి విశేష అలంకరణ చేశారు. ఆలయ ఈవో విశ్వనాథరాజు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

పెద్దాపురం: పట్టణంలోని భువనేశ్వరీ పీఠంలో అమ్మవారు మహాలక్ష్మీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పీఠాధిపతి చింతా గోపీశర్మ అధ్వర్యంలో ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. పెద్దాపురం మరిడమ్మ దేవస్థానంలో ఏసీ విజయలక్ష్మీ, కాండ్రకోట నూకాలమ్మ దేవస్థానంలో ఈవో సౌజన్య ఆధ్వర్యంలో అమ్మవార్లను సర్వాంగ సుందరంగా అలంకరించారు. లలితా సహస్రనామ పారాయణం నిర్వహించారు.

కొత్తపల్లి: కొమరగిరిలో బాలకనక దుర్గ మహలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. రూ.లక్ష విలువ కలిగిన 500, 200,100,20,10 నోట్లతో బాలకనకదుర్గను ఆలయ అర్చకులు అలంకరించారు. ప్రజలు అమ్మవారి దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

గొల్లప్రోలు: పట్టణంలోని బస్టాండు వద్ద గల విజయదుర్గా దేవి ఆలయంలో కనకదుర్గమ్మవారిని కరెన్సీ నోట్లుతో అలంకరించారు. రూ.1.50లక్షలు విలువైన వివిధ రకాల నోట్లుతో అమ్మవారికి అలంకారం చేశారు. అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. పట్టణంలోని బస్టాండు, కరణంగారి తోట, ఈబీసీ కాలనీ, నందిరాయి వీధి, దేవీనగర్ తదితర ప్రాంతాల్లో కనకదుర్గమ్మ ఆలయాలను భక్తులు దర్శించుకుని కుంకుమ పూజలు నిర్వహించారు. కరణంగారితోటలో గల కనకదుర్గమ్మ వారు లక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆయా ఆలయకమిటీ ఆధ్వర్యంలో భక్తుల కోసం ఏర్పాట్లు చేశారు.

గొల్లప్రోలు రూరల్: తాటిపర్తిలో వేంచేసి ఉన్న అపర్ణాదేవి కాత్యాయని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అపర్ణాదేవిని నిమ్మకాయలతో అలంకరించారు. భక్తులు సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు ఆకొండి ప్రభాకరశాస్త్రి పూజాది కార్యక్రమాలు జరిపించగా కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. దుర్గాడ శివాలయంలో ఉమారామలింగేశ్వరస్వామి సన్నిధిలో లలితాదేవిని పుష్పాలతో విశేషంగా అలంకరించారు. అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తులు పూజా కార్యక్రమాలు చేశారు.

పిఠాపురం రూరల్: పిఠాపురం మండలం రాపర్తిలో కొలువయి ఉన్న దుర్గామల్లేశ్వరీ అమ్మవారిని శాకంబరీగా అలంకరించారు. అమ్మవారికి కుంకుమపూజలు చేసి వివిధ రకాల కాయగూరలతో అలంకారం చేశారు. ఆలయ కమిటీ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

లలితాదేవికి సూర్యకిరణ స్పర్శ



గొల్లప్రోలు రూరల్, అక్టోబరు 8: గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయంలో వేంచేసి ఉన్న లలితాదేవికి మంగళవారం సూర్యకిరణాలు తాకాయి. సూర్యకిరణ స్పర్శతో భక్తులు పులకించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

కనకదుర్గమ్మకు బోనాలు సమర్పణ



పిఠాపురం, అక్టోబరు 8: పట్టణంలోని చిట్టోడితోటలో కొలువయి ఉన్న కనకదుర్గమ్మ వారికి మంగళవారం భక్తులు బోనాలు సమర్పించారు. మహిళలు, భవానీభక్తులు బోనాలు తీసుకుని ప్రదర్శనగా ఆలయానికి తీసుకువచ్చారు. తీన్మార్ డప్పులతో గరగనృత్యాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు యర్రంశెట్టి శ్రీనివాస్, దడాల నాని, ఇంటి రాంబాబు తదితరులు పాల్గొన్నారు..

చిన్నారుల సంరక్షణకు పెద్దపీట : ఎమ్మెల్యే నానాజీ

సర్పవరం జంక్షన్, అక్టోబరు 8: చిన్నారుల భవిష్యత్తు బలోపేతం చేసే దిశగా అంగన్‌వాడీ సెంటర్లను మరింత బలోపేతం చేస్తూ చిన్నారుల సంరక్షణ, విద్యకు అధిక ప్రాధాన్యతను ప్రభుత్వం ఇస్తుందని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ అన్నారు. మంగళవారం సర్పవరం ఐసీడీఎస్ రూరల్ నియోజకవర్గ కార్యాలయంలో సీడీపీవో వై.లక్ష్మి ఆధ్వర్యంలో పోషణ్ బీ, పఢై బీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తూ మెరుగైన సమాజం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయన్నారు. ఐసీడీఎస్ పీడీ ప్రవీణ మాట్లాడుతూ అంగన్‌వాడీ సెంటర్లలలో మాతృభాషను ప్రాథమిక విద్యాబోధన అందించేందుకు బోధన-అభ్యాసనా సామాగ్రి అందించడం జరిగిందన్నారు. అడబాల ట్రస్ట్ అధ్యక్షుడు రత్నప్రసాదరావు ఆధ్వర్యంలో 30 మంది రమణయ్యపేట గర్భిణులకు సామూహిక సీమంతాలు ఘనంగా నిర్వహించారు. 10 మంది చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేశారు. గ్రామ సర్పంచ్ శీలం నాగేశ్వరరావు, కూటమి నాయకులు పుల్ల శ్రీరాములు, ముద్దన సూర్యప్రకాశ్, కరెడ్ల గోవిందు, గ్రామ కార్యదర్శి పబ్బినీడి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

'గ్యాస్ డెలివరీ పాయింట్ నిర్మాణ పనులను ఆపాలి'

తాళ్లరేవు, అక్టోబరు 8: పోలేకుర్రు పంచాయతీ పరిధి సుంకటరేవు గ్రామం 216 జాతీయ రహదారి పక్కన రిలయన్స్ ఇండస్ట్రీస్ చేపడుతున్న గ్యాస్‌డెలివరీ పాయింటు నిర్మాణ పనులను నిలిపివేయాలని కోరుతూ పోలేకుర్రు గ్రామస్తులు మంగళవారం ధర్నా చేశారు. సర్పంచ్ వెంటపల్లి నూకరాజు, టీడీపీనేతలు జక్కల ప్రసాద్, వడ్లమూరి సతీష్ ఆధ్వర్యంలో గ్రామస్తులు పనులను అడ్డుకుని ఈ గ్యాస్‌పాయింట్ వల్ల ప్రజలకు జరిగే నష్టాలు, ఉపయోగాలను ప్రజలకు వివరించిన తరువాతమాత్రమే పనులు చేయాలని అంతవరకు పనులు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కోరింగ ఎస్ఐ పీ.సత్యనారాయణ, రెవెన్యూ అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని ప్లాంటు నిర్వాహకులు, గ్రామస్తులతో చర్చించారు. విషయాన్ని ప్లాంటు సంస్థప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లి సాయంత్రంలోపు సమాధానం చెపుతామని చెప్పడంతో తాత్కాలికంగా నిరసన విరమించారు.

'యువతగా ఉన్నప్పుడే విజయావకాశాలు'

కొత్తపల్లి, అక్టోబరు 8: యువతగా ఉన్నప్పుడే విజయావకాశాలు సాధించాలని అమరావతి డీపీవో బమిడి శివమూర్తి అన్నారు. మూలపేట మహిళా నైపుణ్యాభివృద్ధి, ప్రతిభా కేంద్రాల్లో శిక్షణ(డబ్ల్యుఎస్‌డీసీ) పూర్తిచేసుకొన్న 50మంది యువతకు ఆయన మంగళవారం సర్టిఫికెట్లు అందజేశారు. స్థానిక యువతకు అవసరమైన నైపుణ్యాలను సమకూర్చుకుని ప్రైవేటు, ప్రభుత్వ రంగాల్లో అవకాశాలను అన్వేషించడానికి మూలపేట డబ్ల్యుఎస్‌డీసీ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. తమ ప్రాంత యువతకు అన్ని సౌకర్యాలు కల్పించి నిపుణులైన శిక్షకులతో నాణ్యమైన శిక్షణ అందించి తమలో ఆత్మవిశ్వాసాన్ని నింపిన అరబిందో ఫార్మా ఫౌండేషన్ డైరెక్టర్లు కె.నిత్యానందరెడ్డి, పి.శరత్‌చంద్రరెడ్డికి యువత కృతజ్ఞతలు తెలియజేశారు. అరబిందో ఫార్మా ఫౌండేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు వికాసలో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు

కాకినాడ సిటీ, అక్టోబరు 8: వికాస కార్యాలయంలో గురువారం ప్రముఖ కంపెనీలో సాఫ్ట్‌వేర్ డెవలపర్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె లచ్చారావు తెలిపారు. బీఎస్సీ, బీకామ్, బీటెక్, ఎంబీఏ, ఎంఎస్సీ, ఉత్తీర్ణులై వివిధ కంప్యూటర్ కోర్సుల్లో పరిజ్ఞానం కలిగిన స్త్రీ, పురుష అభ్యర్థులు అర్హులన్నారు. ఎంపికైన వారికి సంవత్సరానికి రూ.5లక్షలు జీతం ఉంటుందన్నారు. బెంగుళూరు, అనంతపురంలో పనిచేయాల్సి ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు గురువారం ఉదయం 9 గంటలకు సర్టిఫికెట్ల జెరాక్స్‌లతో కెలెక్టరేట్‌లోని వికాస కార్యాలయం వద్దకు హాజరుకావాలన్నారు.

'క్రీడాకారులకు 1.5 క్రెడిట్స్ ఇవ్వాలి'

జేఎన్టీయూకే, అక్టోబరు 8: స్పోర్ట్స్, గేమ్స్‌లో పాల్గొనే క్రీడాకారులకు 1.5 క్రెడిట్స్ ఇవ్వాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఉపకులపతి ప్రొఫెసర్ కేవీఎస్‌జీ మురళీకృష్ణ అన్నారు. వర్శిటీలోని సెనేట్ హాల్లో జేఎన్టీయూకే స్పోర్ట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో 16వ అనుబంధ కళాశాలల వ్యాయామ విద్య అధ్యాపకుల జనరల్ బాడీ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ఇన్‌చార్జి ఉపకులపతి కేవీఎస్‌జీ మురళీకృష్ణ ముఖ్యఅతిథిగా, రెక్టార్ కేవీరమణ, రిజిస్ట్రార్ రవీంద్రనాథ్ గౌరవ అతిథులుగానూ పాల్గొనగా స్పోర్ట్స్ కౌన్సిల్ కార్యదర్శి డాక్టర్ జి.శ్యామ్‌కుమార్ అధ్యక్షత వహించగా ఇంటర్ కాలేజియేట్ టోర్నమెంట్స్ కార్యదర్శి డాక్టర్ జీపీరాజు స్వాగతం పలికారు. వీసీ మాట్లాడుతూ క్రీడల్లో పాల్గొన్నప్పుడే విద్యార్థులు తరగతి గదిలోనూ, విద్యలోనూ చురుకుగా వ్యవహరిస్తారన్నారు. జి.శ్యామ్‌కుమార్ 2023-24 విద్యాసంవత్సరంలో నిర్వహించిన కార్యక్రమాలను, వార్షిక నివేదికను వినిపించారు. పీహెచ్‌డీ చేసిన పీడీలను అతిథులు సన్మానించారు.



వ్యాయామ విద్య అధ్యాపకులతో వీసీ, రెక్టార్

ప్రభుత్వ కార్యాలయాలకు త్వరలోనే

పక్కా భవనాల నిర్మాణానికి చర్యలు

ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప



సమావేశంలో మాట్లాడుతున్న రాజప్ప

పెద్దాపురం, అక్టోబరు 8: అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు త్వరలోనే పక్కా భవనాల నిర్మాణానికి చర్యలు చేపట్టడం జరుగుతుందని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఎంపీడీవో డి.శ్రీలలిత ఆధ్వర్యంలో ఎంపీపీ పెంకే సత్యవతి అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో చాలావరకు ప్రభుత్వ కార్యాలయాలకు పక్కా భవనాలను నిర్మాణం చేపట్టడం జరిగిందని, అలాగే రాబోయే రోజుల్లో మిగిలిన ప్రభుత్వ కార్యాలయాలకు కూడా పక్కా భవన నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. గత వైసీపీ ప్రభుత్వం అభివృద్ధిని పూర్తిగా పక్కన పెట్టేసిందని, మళ్లీ అభివృద్ధిని పరుగులు పెట్టించాల్సి ఉందన్నారు. దీనికి ప్రజలు, అధికారులతో పాటు స్థానిక ప్రజాప్రతినిధుల సహకారం ఎంతో అవసరమన్నారు. అధికారులు గ్రామాల్లో జరిగే కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని, ప్రభుత్వ పథకాలకు సంబంధిన సమాచారాన్ని తెలియచేయాలన్నారు. పంచాయతీల్లో అభివృద్ధి పనులను చేపట్టాలని, నిధుల కొరత లేకుండా ప్రభుత్వంతో మాట్లాడి, అభివృద్ధిని పరుగులు పెట్టించాలన్నారు. అలాగే విద్యాశాఖ అధికారుల పనితీరుపై ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేశారు. పలు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఆయా గ్రామాల్లో సమస్యలపై ప్రశ్నించారు. తహశీల్దార్ సీహెచ్ వెంకటలక్ష్మీ, ఏపీఎం సూర్యనారాయణ, సర్పంచ్ మొయిళ్ల కృష్ణమూర్తి, మాకిరెడ్డి శ్రీనివాస్ పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు సొసైటీ ఉద్యోగుల సస్పెన్షన్

గొల్లప్రోలు, అక్టోబరు 8: పట్టణంలోని విశాల సహకార పరపతి సంఘం(సొసైటీ)లో పనిచేస్తున్న ముగ్గురు ఉద్యోగులను విధులు నుంచి సస్పెండ్ చేస్తూ సంఘం పర్సన్ ఇన్‌చార్జి, సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ టి.నందన మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. సొసైటీలోని సహచర సిబ్బంది కుర్రె సూర్యశంకర సుబ్రహ్మణ్యం, బస్వా వీరలవకుశ, బస్వా గోవిందులు అసభ్య పదజాలంతో దూషిస్తున్నారని, వేధిస్తున్నారని సబ్‌స్టాఫ్‌గా పనిచేస్తున్న ఒక మహిళా ఉద్యోగిని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అదేవిధంగా వారిపై పలు ఆరోపణలు చేసి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై సొసైటీ పర్సన్ ఇన్‌చార్జిగా ఉన్న నందన స్పందిస్తూ మహిళా ఉద్యోగి ఫిర్యాదుపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాల్సి ఉందని, సదరు విచారణ పారదర్శకంగా నిర్వహించే నిమిత్తం ముగ్గురు ఉద్యోగులను తక్షణం విధులు నుంచి సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ ఉత్తర్వులు తక్షణం అమలులోకి వస్తాయని తెలిపారు.

పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ

కార్పొరేషన్ (కాకినాడ), అక్టోబరు 8: పారిశుధ్య నిర్వహణ విషయంలో ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని కమిషనర్ భావన సూచించారు. కాకినాడ జగన్నాధపురం 7వ సర్కిల్ 23వ డివిజన్‌లో మేకావారి వీధి, చిక్కాల వారి వీధిలో మంగళవారం పారిశుధ్య నిర్వాహణ పనులను ఆమె తనిఖీ చేశారు. డోర్ టు డోర్ కనెక్షన్, చెత్త తరలింపు వాహనాల నిర్వాహణ తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. రోడ్లు, డ్రైన్లు సకాలంలో శుభ్రం చేస్తున్నారా లేదా స్వయంగా పరిశీలించారు. ఈ తనిఖీల్లో ఎంహెచ్ఓ డాక్టర్ పృధ్వీచరణ్, శానిటరీ సూపర్‌వైజర్ రాంబాబు, ఇన్‌స్పెక్టర్ అడపా సత్యనారాయణ ఉన్నారు.

మద్యం షాపులకు 1150 దరఖాస్తులు

కాకినాడ క్రైం, అక్టోబరు 8: నూతన మద్యం పాలసీ 2024-2026కు జిల్లావ్యాప్తంగా ఉన్న 7 ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్లలో మంగళవారం నాటికి 1150 దరఖాస్తులు స్వీకరించామని ఆ శాఖ అధికారిణి ఎం.కృష్ణకుమారి తెలిపారు. దరఖాస్తులు స్వీకరించేందుకు ఆఖరి గడువు బుధవారం సాయంత్రం 5 గంటలలోపు అని తెలిపారు. ఈ నెల 11వ తేదీ ఉదయం 8 గంటల నుంచి కలెక్టరేట్, వివేకానంద సమావేశ మందిరంలో నూతన మద్యం షాపులకు కలెక్టర్ ఆధ్వర్యంలో డ్రా తీయడం జరుగుతుందన్నారు.

229 దరఖాస్తులు...

తాళ్లరేవు, అక్టోబరు 8: తాళ్లరేవు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో మద్యంషాపులకు 229 దరఖాస్తులు వచ్చినట్టు ఎక్సైజ్ సీఐ కె.కోటేశ్వర్ తెలిపారు. స్టేషన్ పరిధిలోని కాజులూరు, కరప, తాళ్లరేవు మండలాల్లో ఉన్న 17 మద్యం షాపులకు 229 మంది దరఖాస్తులు వచ్చాయని ఆయన చెప్పారు.

ఆటో బోల్తా పడి వ్యక్తి మృతి

తాళ్లరేవు, అక్టోబరు 8: చొల్లంగి 216 జాతీయరహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందినట్లు కోరింగ ఎస్ఐ పి.సత్యనారాయణ మంగళవారం తెలిపారు. అయినవిల్లి మండలం కొండుగుదురు గ్రామానికి చెందిన ర్యాలి సత్తిరాజు(42) కొబ్బరికాయల ఆటోతో కాకినాడ వెళ్తుండగా మార్గంమధ్యంలో చొల్లంగి వద్ద ఆటో బోల్తా పడి కాలువలోకి పడింది. కొబ్బరిలోడు ఆటో సత్తిరాజు మీద పడడంతో అక్కడిక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్టు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

ద్రాక్షారామలో రాజప్ప పూజలు

సామర్లకోట, అక్టోబరు 8: పంచారామ పుణ్యక్షేత్రమైన ద్రాక్షారామ మాణిక్యాంబ సమేత భీమేశ్వరునికి మంగళవారం జరిగిన ప్రత్యేక పూజలలో పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పాల్గొన్నారు. దేవీశరన్నవరాత్రి పూజల్లో భాగంగా అమ్మవారిని దర్శించి విశేష కుంకుమార్చన పూజలు నిర్వహించారు. ఆలయ పండితులచే వేదాశీర్వచనంతో తీర్థప్రసాదాలు స్వీకరించారు. రాజప్పకు ఆలయ మర్యాదలతో సాదరంగా స్వాగతం పలికారు. ఎమ్మెల్యే సన్నిహితులు డబుల్ సెవెన్ రాజు పాల్గొన్నారు.

అధికారులకు ఘనంగా సత్కారం

కార్పొరేషన్ (కాకినాడ), అక్టోబరు 8: కాకినాడ నగరపాలక సంస్థలో పనిచేసి బదిలీపై వెళ్తున్న ఆయా విభాగాధిపతులకు కార్పొరేషన్ అధికారులు ఘనంగా వీడ్కోలు పలికారు. అదనపు కమిషనర్ సీహెచ్.నాగనరసింహరావు ఆర్డీగా రాజేమహేంద్రవరం, ఇంజనీరింగ్ సెక్షన్ ఎస్ఈ సత్యకుమారి విజయవాడ కార్పొరేషన్‌కి, టౌన్ ప్లానింగ్ సెక్షన్ డీసీపీ గ్రేటర్ విశాఖపట్నంకు, సెక్రటరీగా పనిచేసిన ఏసుబాబు తాడేపల్లిగూడెం కమిషనర్‌గాను బదిలీ అవ్వడంతో మున్సిపల్ సుపీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సత్కారం నిర్వహించారు. మేనేజర్ కర్రి సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశానికి డిప్యూటీ కమిషనర్ మనోహర్ విచ్చేశారు. కార్యక్రమంలో టీపీఆర్‌వో శైలజ, ఏసీపీ నాగశాస్త్రి, సెక్రటరీ వి.శ్రీకాంత్ రెడ్డి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ డి.పృధ్వీచరణ్, వివిధ సెక్షన్ల సూపరిండెంట్లు జయరాం, రామశాస్త్రి, దుర్గారావు, ఆర్వో నిర్మలకుమారి,మున్సిపల్, సచివాలయ సిబ్బంది ఉన్నారు.



గంజాయి నెట్‌వర్క్‌ను బ్రేక్ చేస్తున్నాం : ఎస్పీ

పిఠాపురం, అక్టోబరు 8: గంజాయి ఎక్కడ నుంచి ఎలా వస్తుంది, ఎవరి ద్వారా సరఫరా అవుతోంది, వినియోగదారులు ఎవ్వరు తదితర విషయాలపై దృష్టిసారించి గంజాయి నెట్‌వర్క్‌ను బ్రేక్ చేస్తున్నామని జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్ తెలిపారు. ఆయన పిఠాపురం పట్టణ పోలీసుస్టేషన్‌లో మంగళవారం తనిఖీలు నిర్వహించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ జిల్లాలో గంజాయి రవాణా, వినియోగంపై ప్రత్యేక నిఘా ఉంచామని.. దీనిపై కాకినాడ, పిఠాపురం తదితర ప్రాంతాల్లో తనిఖీలు కోసం స్పెషల్ టీమ్‌లు ఏర్పాటు చేశామన్నారు. రైల్వేట్రాక్‌లు, ఆర్వోబీలు, నిరుపయోగంగా ఉన్న భవనాలు తదితర ప్రాంతాల్లో పరిశీలించి గంజాయి తాగేవారిని అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేశామని తెలిపారు. కొత్తపల్లి మండలంలో సచివాలయ ఉద్యోగి అదృశ్యంపై విచారణ జరుపుతున్నామని చెప్పారు. దీనిపై ఇప్పటికే పెద్దాపురం డీఎస్పీ ఆధ్వర్యంలో దర్యాప్తు జరిగిందన్నారు. జిల్లాలో నమోదైన అదృశ్యం కేసుల్లో 8 మంది మహిళలు, బాలికల ఆచూకీ లభించాల్సి ఉందని తెలిపారు. పిఠాపురం పట్టణంలో లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ ఇబ్బందులు పరిష్కారం తదితర అంశాలపై సూచనలు ఇచ్చినట్లు చెప్పారు.

కేంద్రంలో రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమే : పళ్లంరాజు

కాకినాడ సిటీ, అక్టోబరు 8: దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో మరింత ఆదరణ పెరుగుతోందని, తదుపరి ఎన్నికల్లో కేంద్రంలో రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని కేంద్ర మాజీ మంత్రి మల్లిపూడి మంగపతి పళ్లంరాజు పేర్కొన్నారు. మంగళవారం కాకినాడలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వివిధ పదవులు చేపట్టిన నేతల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పీసీసీ ఉపాధ్యక్షుడిగా మట్టా శివప్రసాద్, పీసీసీ ప్రధాన కార్యదర్శిలుగా మల్లిపూడి రాంబాబు, నక్కా సత్యనారాయణలతో పాటు కాకినాడ జిల్లా అధ్యక్షుడుగా మాదేపల్లి చిట్టిబాబు, కాకినాడ నగర అధ్యక్షుడుగా చెక్కా నూకరాజు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం గత జిల్లా అధ్యక్షుడు చిలుకోటి పాండురంగారావును, ముఖ్యఅతిథి పళ్లంరాజును, ప్రమాణ స్వీకారం చేసిన నేతలను శాలువాలతో సత్కరిచారు. కార్యక్రమంలో పీసీసీ అధికార ప్రతినిధులు మస్తాన్ వల్లీ, కామన ప్రభాకరరావు, జిల్లా ఇన్‌చార్జి మేడా సురేష్, కాంగ్రెస్ నేతలు టీకే విశ్వేశ్వరరెడ్డి, మారోతి శివగణేష్, తుమ్మల దొరబాబు, దాట్ల గాంధీరాజు, నీరుకొండ సత్యనారాయణ, బండారు జయప్రకాష్, తాళ్లూరి రాజు, పోలిశెట్టి శ్రీను, పబ్బినీడి కృష్ణ, అయతాబత్తుల సుభాషిణి, ఆకుల లలిత, పిల్లి సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి టీటీ పోటీల్లో 'శ్రీప్రకాష్' విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబరిచిన శ్రీప్రకాష్ విద్యార్థులు

పెద్దాపురం, అక్టోబరు 8: స్థానిక శ్రీప్రకాష్ సినర్జీస్ పాఠశాల విద్యార్థులు సీబీఎస్ఈ జాతీయస్థాయి టీటీ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభను కనబరిచినట్లు పాఠశాల డైరెక్టర్ సీహెచ్ విజయ్‌ప్రకాష్ తెలిపారు. హిమాచల్‌ప్రదేశ్‌లో జరిగిన పోటీల్లో తమ టీటీ శిక్షణ అకాడమీలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు కాంస్య పతకాలను సాధించారన్నారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న చిట్టూరి సాయిశృతి (అండర్ 17) మిక్సడ్ డబుల్స్ విభాగంలో, గర్ల్స్ టీమ్ విభాగంలో ఎం.శాంతిజ్యోతి, ముపర్లదాస్ జాతీయ స్థాయిలో కాంస్య పతకాలు సాధించారన్నారు. విజేతలను విద్యాసంస్థల అధినేత సీహెచ్‌వీకే నరసింహారావు, జాయింట్ సెక్రటరీ సీహెచ్ సమీర, సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్ మూర్తి అభినందించారు.

శ్రీపీఠంలో వైభవంగా మహాశక్తి యాగం



శ్రీరాజరాజేశ్వరీదేవిగా రూపంలో ఐశ్వర్యాంబికా

సర్పవరం జంక్షన్, అక్టోబరు 8: కాకినాడ రూరల్ రమణయ్యపేట శ్రీపీఠంలో స్వామీ పరిపూర్ణానంద సరస్వతి ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న మహాశక్తి యాగం- 2024 మంగళవారం నాటికి ఆరోరోజుకి చేరింది. శతకోటి కుంకుమార్చనలో భాగంగా ఇప్పటికి 50 కోట్లకు చేరినట్లు స్వామీ పరిపూర్ణానంద తెలిపారు. దేవీశరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా శ్రీరాజరాజేశ్వరి దేవీగా ఐశ్వర్యాంబిక భక్తులకు దర్శనమిచ్చారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ శ్రీరాజరాజేశ్వరిదేవికి మంగళ చండీ, రాజరాజేశ్వరి హోమం నిర్వహించారు. ఇష్ట కార్యసిద్ధి కోసం అమ్మవారికి సారెల సమర్పించారు. స్వామీజీ భక్తులను ఉద్దేశించి అనుగ్రహ పారాయణం చేశారు. బుధవారం మూలా నక్షత్రం సందర్భంగా శ్రీపీఠంలో త్రికోటి మహా సరస్వతి పూజకు విస్తృత ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. తొలిసారిగా 3 కోట్ల సరస్వతి నామాన్ని 24 వేలమంది విద్యార్థులతో జపించే మహాక్రతువుకు శ్రీపీఠం వేదిక కానుందన్నారు. ఉదయం 6.30 గంటలకు సరస్వతి పూజలు, 8.30 గంటలకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించడం జరుగుతుందన్నారు. 30 వేల మందికి పైగా మాతృమూర్తులు శతకోటీ కుంకుమార్చన, లలిత రహస్య సహస్ర నామంలో పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రం ప్రారంభం

తాళ్లరేవు, అక్టోబరు 8: పి.మల్లవరంలో నూతనంగా ఏర్పాటుచేసిన ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రాన్ని రాష్ట్ర టెలిటిక్ లీడ్ డైరెక్టర్ చంద్రశేఖర్ మంగళవారం ప్రారంభించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ధూళిపూడి వెంకటరమణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో చంద్రశేఖర్ మాట్లాడుతూ సేంద్రీయ ఎరువులు, కాషాయం, జీవామృతం తదితర అంశాలపై వివరించారు. సేంద్రీయ ఎరువులు, కెమికల్స్‌కు వ్యత్యాసాలను వివరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ ఎలియాజర్, ఏడీ బాబూరావు, మాస్టర్ ట్రైనర్ ధనలక్ష్మి, సీఎస్ఎఫ్ సిబ్బంది, వుంగరాల వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ ధూళిపూడి నాగేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

కరప, అక్టోబరు 8: బాణసంచా తయారీ కేంద్రాల్లో ప్రభుత్వ నిబంధనలను పక్కాగా పాటించాలని, ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కాకినాడరూరల్ సీఐ చైతన్యకృష్ణ, కరప తహశీల్దార్ నందిపాటి సత్యనారాయణ, ఎస్ఐ తోట సునీతలు హెచ్చరించారు. మండలంలోని వేళంగి, నడకుదురు గ్రామాల్లోని త్రిమూర్తులు, నానాజీ, ధనలక్ష్మి బాణసంచా తయారీకేంద్రాలను వారు తనిఖీ చేసి రికార్డులు, స్టాక్‌ను పరిశీలించారు.

బీజేపీ గెలుపు పట్ల హర్షం

సర్పవరం జంక్షన్, అక్టోబరు 8: హర్యానా రాష్ట్రంలో బీజేపీ పార్టీ మూడోసారి హ్యాట్రిక్ విజయం సాధించడం పట్ల జిల్లా బీజేపీ అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు. ప్రత్యర్థుల అంచనాలను తలకిందులు చేస్తూ బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. ప్రధాని మోదీ పాలనపై ప్రజలకు పూర్తి విశ్వాసం ఉందని.. కేంద్రం, రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలు పూర్తి విశ్వాసంతో ముచ్చటగా మూడో పర్యాయం అధికారం అప్పగించారన్నారు. త్వరలో మహారాష్ట్ర, ఝార్ఖండ్‌లో అధికారంలోకి రానున్నామని తెలిపారు.

ప్రకటన

నా క్లయింట్లు కాకినాడ జిల్లా కాకినాడ డోర్‌నెం. 17-11-8/1, సాంబమూర్తినగర్ వాస్తవ్యులు **1) పరిమి రాముగారి కుమారుడు పరిమి సూర్యప్రకాష్ మరియు వారి భార్య 2) పరిమి కృష్ణవేణి గార్ల** తరపున ఈ ప్రకటన ఇవ్వడమైనది.

కాకినాడ జిల్లా, కాకినాడ జగన్నాధపురం, సరోజినీరోడ్, డోర్‌నెం. 52-1-79గల స్థిరాస్తి రెండు అయిటములుగా 1) 174.20 చ॥గజలు మరియు 2) 75.80 చ॥గజలు మొత్తం 250.30 చ॥గజలు స్థలము ప్రస్తుతం రెడ్‌వుడ్ సిటీ U.S.Aలో నివాసం గల హరిదాసు వెంకన్న గారి కుమారుడు హరిదాసు శ్రీనివాస్‌గారికి గిఫ్ట్ సెటిల్‌మెంట్ దస్తావేజు నెం.10258/2012 మరియు క్రియదస్తావేజు, దస్తావేజు నెం. 785/2009 ద్వారా పడి వారి స్వాధీనములో యున్నవి.

సదరు హరిదాసు శ్రీనివాస్‌గారి నుండి పైన పేర్కొన్న ఆస్తి మా క్లయింట్లు క్రియం పొందుటకు ఏర్పాటు చేసికొనియున్నారు. కావున పై ఆస్తి మా క్లయింట్లు క్రియం పొందుటకు ఎవ్వరికైనా అభ్యంతరములు, ఆక్షేపణలుయున్న ఈ ప్రకటన తేది నుండి 7 రోజుల్లోగా ఈ దిగువ చిరునామాదారునికి తెలుపగలరు. లేని యెడల సదరు ఆస్తి నిరభ్యంతర నిరాక్షేపణయని తలంచి మా క్లయింట్లు క్రియం పొందగలరు. తరువాతి అభ్యంతరములు మా క్లయింట్లపై బైండు చేయనేరవు

N.V. హయగ్రీవరావు
K. శ్రీఅనుహిత,
అడ్వకేట్స్, 21-1-7, సాలిపేట, కాకినాడ-1, ఫోన్: 98495 99091
కాకినాడ
ది.8-10-24

దేవదాయ ధర్మదాయశాఖ

శ్రీ కనకదుర్గ అమ్మవారి దేవస్థానం

సంత చెరువు, సినిమారోడ్, కాకినాడ, కాకినాడ జిల్లా.

టెండర్ కమ్ బహిరంగ వేలం ప్రకటన

కాకినాడ జిల్లా, కాకినాడ, సినిమారోడ్, సంత చెరువు వద్ద వేంచేసియున్న శ్రీ కనకదుర్గ అమ్మవారి దేవస్థానము నందు ఈ దిగువ పేర్కొన్న షెడ్యూలు ప్రకారం శ్రీ అమ్మవారి దేవస్థానం నందు ది.24-10-2024వ తేది ఉదయం గం.10.00లకు శ్రీ [illegible] దేవదాయశాఖ, కాకినాడవారి సమక్షమున టెండర్-కమ్-బహిరంగ వేలము జరుపబడును.

ప.నెం.	వివరము	ధరావత్తు	కాలపరిమితి
1.	భక్తులచే సమర్పించబడిన సగం కొబ్బరి చెక్క ప్రోగు చేసుకునే హక్కులకు (ప్రతి సంవత్సరం 10% పెంపుదలతో)	రూ.50,000/-	ది.01-11-2024 నుండి ది.31-10-2026 వరకు

బహిరంగ వేలం పాట షరతులు

1) [illegible]
2) [illegible]
3) [illegible]
4) [illegible]
5) [illegible]
6) [illegible]

కాకినాడ నగరం,
ది.08-10-2024.
[illegible]
కార్యనిర్వహణాధికారి [illegible]

శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానం

దేవదాయ ధర్మాదాయ శాఖ,
జగన్నాధపురం, కాకినాడ-2, కాకినాడ జిల్లా.

టెండర్ కమ్ బహిరంగ వేలం ప్రకటన

[illegible] ది.17.10.2024 [illegible] ఉదయం 10.00 గంటలకు [illegible]

వరుస నెం.	వివరము	కాలపరిమితి	ధరావత్తు సొమ్ము
1	షాపు నెం.3 (5 ½ x 7 ½) నందు వ్యాపారం చేసుకొను హక్కు	పాట ఖాయపరచిన తేది నుండి మూడు సంవత్సరముల కాలపరిమితికి	25,000/-
2	దేవస్థానం నందు భక్తులచే సమర్పించబడు కొబ్బరి చెక్కలలో సగ భాగం ప్రోగు చేసుకొను హక్కు	2-12-2024 నుండి 1-12-2026 (రెండవ సంవత్సరం 10% పెంపుదల తో)	25,000/-
3	[illegible]	ది.1.12.2024 నుండి 30.11.2025	---

[illegible]

కాకినాడ,
2.10.2024.
[illegible]
కార్యనిర్వహణాధికారి, గ్రేడ్-1.

ప్రకటన

నా క్లయింటు పెదపూడి మండలం, పెద్దాడ గ్రామ కాపురస్తులు **బొడ్డు (లేటు) భాస్కరరామారావు గారి భార్య జగన్మోహిని గారి** సంజాయిషీపై తెలియచేయునది ఏమనగా

ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తి నా క్లయింటు వాటాకు, అనగా కాకినాడ 2వ అదనపు సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో O.S.No. 198/1979లో ఫైనల్ డిక్రీలో రాబడి, నా క్లయింటుకు స్వాధీనము కాబడి, నా క్లయింట్‌చే కాంపౌండ్ గోడ కట్టబడి, నా క్లయింటు యొక్క స్వాధీన, సంపూర్ణ హక్కు భుక్తములతో యుండియున్నది. సదరు ఆస్తిని గూర్చి నా క్లయింటు పరోక్షమున ఎవరు ఎటువంటి వ్యవహారములు జరిపినా చెల్లనేరవని అట్లు జరిపిన వ్యవహారములు నాక్లయింటును గాని, షెడ్యూల్ ఆస్తినిగాని ఎంత మాత్రము బైండ్ చేయజాలవని మరియు అట్లు జరిపిన వారు నష్టపోవుదరని ఇందుమూలముగా తెలియపరచటమైనది.

షెడ్యూలు

పూర్వము తూర్పుగోదావరి జిల్లా, ప్రస్తుతం కాకినాడ జిల్లా, కాకినాడ సిటీ, సూర్యారావుపేట, వార్డునెం.2, బ్లాక్‌నెం.8 T.S.No.43/2లో మొత్తం ఎ.0.95 సెంట్లలో పడమర వైపు రోడ్డులో పోగా మిగిలిన ఆస్థి ఈ దిగువ హద్దుల మధ్యస్తమైనది. **తూర్పు:** ఈ ఆస్థి తాలూకా కాంపౌండ్ గోడ అవతల N.F.C.L.వారి కాంపౌండు గోడ. **దక్షిణం :** ఈ ఆస్థి తాలూకా కాంపౌండ్ గోడ అవతల N.F.C.L. వారి కాంపౌండు గోడ. **పడమర :** ఈ ఆస్థి తాలూకా కాంపౌండ్ గోడ అవతల 100 అడుగుల పావురాల తూము రోడ్ **ఉత్తరం :** ఈ ఆస్థి తాలూకా కాంపౌండ్ గోడ అవతల D.S.P. గారి ఆస్థి.

పై ఆస్థి యావత్తు యాజిమెంటు హక్కులతో సహా.

కాకర వెంకటేశ్వరరావు, అడ్వకేట్,
డోర్‌నెం. 12-1-40, జవహర్ వీధి, కాకినాడ
ఫోన్: 0884-2367503, 98483 14081
కాకినాడ
ది.8-10-2024

'అల'గైతేనే ఆపొచ్చు!





ఉప్పాడ బీచ్ వద్ద సముద్రపు అలల ఉధృతి.. కోతకు ధ్వంసమైన జియోట్యూబ్, రహదారి (ఫైల్)

ఉప్పాడ బీచ్ అంటే గుర్తుకు వచ్చేది అందమైన నీలి సముద్రం. కానీ అంతకుమించి భయపెట్టే సముద్రపు కోత కూడా. ఏయేటికాయేడు సముద్రం అంతకంతకూ ముందుకు వస్తూ కలవరపెడుతోంది. రానురాను వందల ఎకరాల భూములను తనలో కలిపేసుకుంటోంది. ఇలా ఇప్పటివరకు సముద్రగర్భంలో కరిగిపోయిన భూమి జిల్లాలో 1,360 ఎకరాలు. భవిష్యత్తులో ఈ కోత తీవ్రత మరింత పెరగబోతోందన్న హెచ్చరికలు సైతం భయపెడుతున్నాయి. ఈ నేపథ్యంలో కోతనివారణకు ఎన్‌సీఆర్‌సీ శాస్త్రవేత్తలు ప్రత్యేక అధ్యయనం చేసి నష్టనివారణ ప్రణాళికలు సిద్ధం చేశారు. అందులోభాగంగా ఉప్పాడ వద్ద సముద్ర అలల తీవ్రత తగ్గించేందుకు సముద్రం అడుగు నుంచి ప్రత్యేక కాంక్రీట్ గోడ నిర్మించాలని తేల్చారు. దానిపై టెట్రాపాడ్‌లు, రాళ్లను పేర్చి కోత నుంచి కాపాడే మార్గం సూచించారు. అలాగే దక్షిణం వైపు కొత్తగా ఇసుకతో బీచ్‌ను సృష్టించాలని గుర్తించారు. కాకినాడ డీప్ వాటర్‌పోర్టు డ్రెడ్జింగ్ ద్వారా వెలికితీసే ఇసుకను రెండేళ్లలో కోటి క్యూబిక్ మీటర్ల వరకు తెచ్చి కొత్త ఇసుక తిన్నెలను తీర్చిదిద్దాలని ప్రతిపాదించారు. తద్వారా కోత నివారణ సాధ్యమేనని నిగ్గుతేల్చారు. దీనికి రూ.250 కోట్ల వ్యయవుతుందని అంచనా.

- ఉప్పాడ సముద్రపుకోత నివారణకు పూర్తి స్థాయి ప్రణాళికలు సిద్ధం చేసిన శాస్త్రవేత్తలు
- అలలు అధికంగా ఉన్నచోట ఉత్తరం వైపు సముద్రం అడుగులో కాంక్రీట్, టెట్రాపాడ్‌లతో ప్రత్యేక గోడ
- ఉప్పాడ బీచ్ దక్షిణం వైపు కోటి క్యూబిక్ మీటర్ల ఇసుకతో ఒక కొత్త బీచ్ సృష్టించాలని నిర్ణయం
- కాకినాడ డీప్‌వాటర్ పోర్టు ఏటా డ్రెడ్జింగ్ చేసే ఇసుకంతా తెచ్చి పోగేయాలని ప్లాన్
- కొత్త బీచ్‌ను సృష్టిస్తే కోత తగ్గే అవకాశం
- మొత్తం 12 కిలోమీటర్ల మేర కోత నివారణకు రూ.250 కోట్లతో ప్రత్యేక ప్రణాళిక

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఉప్పాడ అంటే సముద్రం. మత్స్యకారులు. ఇక్కడి నుంచి నిత్యం వందలాది మంది మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్తూ జీవనం సాగిస్తుంటారు. ఇక్కడ వారి నివాసాలన్నీ తీరానికి ఆనుకునే ఉంటాయి. కానీ గడచిన ఇరవై ఏళ్లుగా ఇక్కడ సముద్రం అంతకంతకూ ముందుకు వచ్చేస్తోంది. తుఫాన్లు, అల్పపీడనం సమయాల్లో అయితే ఉప్పాడ తీరంలో సముద్రం అల్లకల్లోలంగా మారుతోంది. రక్షణగోడ కోసం పేర్చిన రాళ్లు సైతం అలల ధాటికి ఎగిరిపడుతూ ఉప్పాడ రోడ్డును ఛిద్రం చేసేస్తున్నాయి. చివరకు ఉప్పాడకు సమీపంలో బ్రిడ్జి పరిసరాల్లో సముద్రం పూర్తిగా ముందుకు వచ్చేసింది. అసలు తీరం అనేదే కనిపించదు. ఇలా ఇప్పటివరకు ఉప్పాడ పరిసరాల్లో సముద్రపు కోత వల్ల ఏకంగా 1,360 ఎకరాలు సముద్ర గర్భంలో కలిసిపోయాయి. రెండు ఆలయాలు, 150 వరకు ఇళ్లు మునిగి పోయాయి. అయితే వాతావరణ మార్పుల ప్రభావంతో భవిష్యత్తులో ఇక్కడ కోత మరింత పెరుగుతుందని శాస్త్రవేత్తలు హెచ్చరించారు. అలాగని సముద్రం ముందుకు వస్తే వేరే చోటకు వెళ్లడానికి మత్స్యకారులు అంగీకరించడం లేదు. చావైనా బతుకైనా ఇక్కడే అంటున్నారు. మరోపక్క తీరానికి ఆనుకుని పచ్చటి పంట పొలాలు వందలాది ఎకరాల్లో విస్తరించి ఉన్నాయి. అనేక పరిశ్రమలు, కంపెనీలు కూడా ఉప్పాడ తీరానికి కూతవేటు దూరంలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఉప్పాడ కోత నివారణకు గతంలో అనేక ప్రయత్నాలు జరిగినా ఏవీ పెద్దగా ఫలించడం లేదు. దీంతో అధికారంలోకి వస్తే శాశ్వత కోత నివారణకు చర్యలు చేపడతామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చింది. దీనికి తగ్గట్లుగానే ప్రభుత్వం అడుగులు వేయడం ప్రారంభించింది. పైగా ఉప్పాడ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నియోజకవర్గం పిఠాపురం పరిధిలోనే ఉండడంతో ఆయన కూడా కోత నివారణకు పరిష్కారం చూపాలని పట్టుదలగా ఉన్నారు. దీంతో కొన్నినెలల కిందట ఉప్పాడ బీచ్‌కోతను అధ్యయనం చేయడానికి నేషనల్ కోస్టల్ రీసెర్చ్ సెంటర్ (ఎన్‌సీఆర్‌సీ) శాస్త్రవేత్తలు వచ్చారు. ఉప్పాడ వద్ద సముద్ర అలల తీవ్రతకు సంబంధించి వేవ్ కరెంట్, సముద్రం అడుగున చోటుచేసుకుంటున్న పరిణామాలన్నింటినీ అధ్యయనం చేసి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశారు. ఉప్పాడ వద్ద దక్షిణం, ఉత్తర దిశల్లో ఎలాంటి చర్యలు చేపట్టాలో డ్రాఫ్ట్ రూపొందించారు.

కొత్త బీచ్ సృష్టించాల్సిందే...

ఉప్పాడ వద్ద సముద్రం అలల తీవ్రత చాలా అధికంగా ఉన్నట్టు తేల్చారు. దీనికి పలు కారణాలు గుర్తించారు. అయితే ఈ అలల తీవ్రతను కొంత తగ్గించగలిగితే కోత బాగా నెమ్మదిస్తుందని అంచనా వేశారు. ఇందుకోసం ఉప్పాడ వద్ద తీరం నుంచి 170మీటర్లలోపు సముద్రంలో అత్యంత బలంగా కాంక్రీట్‌తో నిలువునా గోడ నిర్మించాలని ప్రతిపాదించారు. దీనికి టెట్రాపాడ్‌లు కూడా కలపనున్నారు. టెట్రాపాడ్‌లు మూడు కాళ్ల ఆకారంలో కాంక్రీట్ దిమ్మల్లా చాలా బలంగా ఉంటాయి. వీటిని కాంక్రీట్ గోడపై అమర్చుతారు. ఆపైన మళ్లీ భారీ రాళ్లు పేర్చుతారు. దీనివల్ల ఉప్పాడ వైపు అలల తీవ్రత దాదాపుగా తగ్గుతాయి. దీనివల్ల కోత చాలా నెమ్మదిస్తుంది. అయితే భారీ అలల తీవ్రత తట్టుకుని ఒడ్డు నుంచి 170మీటర్లలోపు సముద్రంలో దీని నిర్మాణం చాలా కష్టంతో కూడుకున్న పని. కానీ ఇది చేస్తే కోత ఆపవచ్చని ప్రతిపాదిచారు. అలాగే ఉప్పాడకు దక్షిణంవైపు కాకినాడ నుంచి వచ్చే దారిలో మలుపు వద్ద సముద్రం పూర్తిగా ముందుకు వచ్చేసింది. ఇసుక అనేదే లేదు. ఉప్పాడ రోడ్డును ఆనుకుని పేర్చిన రాళ్లను సముద్ర కెరటాలు దారుణంగా తాకుతున్నాయి. మున్ముందు ఇక్కడ సముద్రం మరింత ముందుకు రాబోతోంది. ఈనేపథ్యంలో ఇక్కడ కొత్త బీచ్‌ను సృష్టించబోతున్నారు. దీనివలన అలల ఉధృతి తగ్గి కోత నెమ్మదిస్తుంది. అయితే ముందుకు వచ్చిన సముద్రం వద్ద బీచ్ సృష్టించడం తేలికైన పని కాదు. అయితే కోత నివారణకు ఇదొక్కటే పరిష్కారం. దీంతో శాస్త్రవేత్తలు మొత్తం అధ్యయనం చేసిన తర్వాత ఓ పరిష్కారం కనుగొన్నారు. ఉప్పాడకు సమీపంలో కాకినాడ డీప్‌వాటర్ పోర్టు ఉంది. నేరుగా భారీ నౌకలు ఈ పోర్టుకు వస్తాయి. అయితే నౌకలు వచ్చే మార్గంలో ఏటా ఇసుక డ్రెడ్జింగ్ చేసి నౌకా మార్గానికి ఇబ్బంది లేకుండా చేస్తారు. అయితే ఇలా డ్రెడ్జింగ్ చేసిన సమయంలో భారీగా ఇసుక వస్తుంది. ఆ ఇసుకను ఇంత కాలం సముద్రంలోనే వేరేచోట పోసేస్తున్నారు. కానీ ఇప్పుడు ఆ ఇసుకంతటిని తెచ్చి ఉప్పాడ దక్షిణం వైపు పోసి కొత్త బీచ్ సృష్టించనున్నారు. ఏడాదికి 50లక్షల క్యూబిక్ మీటర్ల చొప్పున, రెండేళ్లకు కోటి క్యూబిక్ మీటర్ల ఇసుకను తెచ్చి ఇక్కడ డంప్ చేస్తారు. ఒకరకంగా ఇసుక తిన్నెలను సృష్టించి బీచ్ తయారు చేస్తారు. 20 మీటర్ల పొడవునా ఈ కొత్త బీచ్ ఉంటుంది. తద్వారా అలల తీవ్రతను ఇసుక తిన్నెలు అడ్డుకుని కోతను తగ్గిస్తాయని శాస్త్రవేత్తలను తేల్చారు. ఇలా 12 కిలోమీటర్లమేర కోత నివారణ చర్యలు చేపట్టడానికి రూ.250కోట్లు ఖర్చవుతుందని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక పంపారు. ఈ నివేదిక ఇటీవల కేంద్రానికి వెళ్లింది. ప్రపంచబ్యాంకు నిధులతో పనులకు ఆమోదం వచ్చే అవకాశం ఉంది.

కోతను ఆపొచ్చు..



ఉప్పాడ వద్ద అలల తీవ్రతను సూచించే రిప్ కరెంట్ ఎక్కువగా ఉంది. దీని నివారణకు ఉప్పాడకు ఉత్తర, దక్షిణ ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టాలి. ఇప్పటికే కోత నివారణ ప్రణాళికను ప్రభుత్వానికి అందించాం.

- రమణమూర్తి, డైరెక్టర్, నేషనల్ కోస్టల్ రీసెర్చి సెంటర్

14 నుంచి పల్లె పండుగ

జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న షాన్‌మోహన్

కలెక్టరేట్ (కాకినాడ), అక్టోబరు 8: రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ఈనెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు జిల్లాలో అన్ని పంచాయతీల్లో పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాల విజయవంతానికి కృషి చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ చెప్పారు. మంగళవారం ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్, పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధిశాఖ డైరెక్టర్ కృష్ణతేజ, ఇతర ఉన్నత స్థాయి అధికారులతో అమరావతి నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఈ కాన్ఫరెన్స్‌కు కలెక్టరేట్ నుంచి కలెక్టర్ షాన్‌మోహన్, జిల్లా పరిషత్, డ్వామా, పంచాయతీ, పంచాయతీరాజ్ శాఖల అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ షాన్‌మోహన్ మాట్లాడుతూ గత ఆగస్టు 23న జిల్లాలో 385 పంచాయతీల్లో ఒకేసారి గ్రామ సభలు నిర్వహించడం జరిగిందన్నారు. అలాగే ఈనెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు నిర్వహించే పల్లెపండుగ పంచాయతీ వారోత్సవాలను జిల్లాలో వివిధ నియోజకవర్గాల ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేస్తూ నిర్వహించేందుకు కృషి చేయడం జరుగుతుందని ఉపముఖ్యమంత్రికి వివరించారు. జిల్లాలో సీసీ డ్రైన్స్, సీసీ రోడ్లు సంబంధించి ఇప్పటికే ప్రతిపాదించిన 70 శాతం పనులు మంజూరు చేయడం జరిగిందన్నారు. గిరిజన ప్రాంతంలో బీటీ రోడ్లు నిర్మాణానికి ప్రతిపాదనలు చేయడం జరిగిందన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో జిల్లా పరిషత్ సీఈవో లక్ష్మణరావు, డ్వామా పీడీ వెంకటలక్ష్మి, జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్, పంచాయతీరాజ్ ఎస్ఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కాకినాడలో టీడీపీ ఎమ్మెల్యేల సమావేశం

కాకినాడ సిటీ/కలెక్టరేట్ (కాకినాడ), అక్టోబరు 8 : కాకినాడలో ఉన్న జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బుధవారం మధ్యాహ్నం మూడు గంటలకు టీడీపీ ఎమ్మెల్యేల సమావేశం జరుగుతుంది. జిల్లాలో ఉన్న టీడీపీ ఎమ్మెల్యేలు దీనికి హాజరవుతున్నారు. ఉభయగోదావరి జిల్లాలు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు నేపథ్యంలో గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదుపై ప్రధానంగా చర్చించనున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యేలు తొలిసారిగా జిల్లా పార్టీ కార్యాలయంలో భేటీ అవుతున్నారు.

60 లీటర్ల సారాతో ఇద్దరి అరెస్ట్

ప్రత్తిపాడు, అక్టోబరు 8: ప్రత్తిపాడు ఎస్‌ఐ ఎస్.లక్ష్మీకాంత్, సిబ్బంది మంగళవారం స్థానిక నరేంద్రగిరి, ఒమ్మంగిలలో దాడులు నిర్వహించి 60లీటర్ల సారాతో ఇద్దరిని అరెస్ట్ చేసి 2 మోటార్ బైకులను స్వాధీనం పరుచుకున్నారు. నిందితులు ఇద్దరిని స్థానిక కోర్టులో హాజరుపరిచనట్టు ఎస్‌ఐ లక్ష్మీకాంతం తెలిపారు.

డొక్కా సీతమ్మ క్యాంటీన్‌లో భోజనాలు



జగ్గంపేట, అక్టోబరు 8: జగ్గంపేట పాత పోలీస్‌స్టేషన్ వద్ద ప్రతి మంగళవారం జనసేన పార్టీ ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డొక్కా సీతమ్మ ఉచిత క్యాంటీన్‌లో రామవరం మండపాక బాపన్నదొర ఆర్థిక సాయంతో భోజనాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మండపాక బాపన్నదొర, రామవరం ఎంపీటీసీ దొడ్డా శ్రీను, మొగిలి గంగాధర్, మాదారపు వీరబాబు, రాజనాల శ్రీను, సూరపురెడ్డి నరేష్, కాయల మణికంఠ, జట్ల వీరభద్ర, పులి ప్రసాద్, గంధం శ్రీనివాస్, సోమవరం శ్రీను, రేపూరి శ్రీను, గోకేడ రమణ, పొన్నగంటి వీరబాబు, కొలమూరు బుజ్జి, సూరిబాబు, ఆదిబాబు ఉన్నారు.

గ్రామాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలి : ఎంపీడీవో

ప్రత్తిపాడు, అక్టోబరు 8: గ్రామాల అభివృద్ధిలో పంచాయతీ వార్డు మెంబర్లు, ఉపసర్పంచ్‌లు భాగస్వాములు కావాలని ఎంపీడీవో ఎంపీఆర్ కుమార్ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని వార్డు మెంబర్లు, ఉపసర్పంచ్‌లకు నిర్వహించిన 2 రోజుల శిక్షణా తరగతులు మంగళవారం ముగిశాయి. ఎంపీడీవో మాట్లాడుతూ మూడంచెల పాలన వ్యవస్థను అవగాహన చేసుకుని స్వపరిపాలన దిశగా ప్రజాస్వామ్యానికి పట్టుకొమ్మలుగా నిలిచే గ్రామాల్లో ప్రజల మౌలిక వసతుల కల్పనకు వార్డుమెంబర్లు, ఉపసర్పంచ్‌లు కృషి చేయాలన్నారు. సమావేశంలో ఈవోపీఆర్డీ కాశీ విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో సబార్డినేట్‌గా పనిచేసి కత్తిపూడికి బదిలీ అయిన ఉమను ఎంపీడీవో, పంచాయతీల కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు సన్మానించారు.

మహాలక్ష్మీగా దర్శనం



కోటనందూరు, అక్టోబరు 8: శరన్నవరాత్రులను పురస్కరించుకుని కాకరాపల్లిలో దుర్గామాత మండలంలో శ్రీమహాలక్ష్మీఅమ్మవారు అవతారంలో దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఏవినగరంలో...

తొండంగి, అక్టోబరు 8: ఏవినగరం గ్రామంలో శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరుని ఆలయంలో అమ్మవారు మంగళవారం మహాలక్ష్మీగా భక్తులకు దర్శనమిచ్చారు. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు సతీమణి విజయలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు.

యోగా పోటీల్లో 'శ్రీ ప్రకాష్' విద్యార్థుల ప్రతిభ

తుని రూరల్, అక్టోబరు 8: జాతీయ స్థాయి యోగా పోటీల్లో శ్రీ ప్రకాష్ విద్యార్థులు బంగారు పతకాలు కైవసం చేసుకున్నారు. సీబీఎస్‌ఈ వారిచే గుజరాత్ రాష్ట్రంలో జరిగిన జాతీయ స్థాయి యోగా పోటీల్లో అండర్-17 బాలుర విభాగంలో జీఎస్ఎస్ చరణ్, పి.సోహన్‌శ్రీ, బి.దేవాన్ష్ నాయుడు, సీహెచ్ జై దీప్, వి.చైతన్య బృందం ప్రథమస్థానంలో నిలిచి గోల్డ్ మెడల్స్ సాధించారు. శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయ్ ప్రకాష్ విద్యార్థులను అభినందించారు. తమ విద్యాసంస్థల నందు చదువుతో పాటు ఇతర రంగాల్లో ప్రాముఖ్యత ఇవ్వడం, విద్యార్థులు అంకిత భావంతో కూడిన నిరంతర కఠినమైన సాధన ఈ ఘన విజయానికి కారణమని తెలిపారు. వివిధ జోన్ నుంచి 18టీంలు ఈ పోటీల్లో పాల్గొనగా తమ విద్యార్థులు మొదటిస్థానంలో నిలిచి గోల్డ్ మెడల్స్ సాధించడం గర్వకారణమన్నారు. విద్యాసంస్థల అధినేత సీహెచ్ వీకేనరసింహారావు, యోగా గురువులు డి.సురేష్, జయంతిలు విద్యార్థులను అభినందించారు.

ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు శిక్షణ

జగ్గంపేట, అక్టోబరు 8: పంచాయతీలను ప్రగతి దిశగా తీసుకెళ్లేందుకు పాలక వర్గ సభ్యులు కృషి చేయాలని ఎంపీడీవో ఏపీఎస్ చంద్రశేఖర్ సూచించారు. జగ్గంపేట మండల పరిషత్ కార్యాలయంలో ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు శిక్షణ కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఎంఎస్ భాస్కరరావు, కార్యదర్శులు ఉన్నారు.

బాణసంచా తయారీ కేంద్రాల పరిశీలన

జగ్గంపేట, అక్టోబరు 8: జగ్గంపేట, గండేపల్లి మండలాల్లో బాణసంచా తయారీ కేంద్రాలను మంగళవారం పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు పరిశీలించారు. అన్ని రకాల సౌకర్యాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. జగ్గంపేట తహశీల్దార్ జేవీఆర్ రమేష్, జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీనివాస్, అగ్నిమాపక అధికారి, జగ్గంపేట ఎస్‌ఐరఘునాధరావు, గండేపల్లి ఎస్‌ఐ శివ నాగబాబు, అగ్నిమాపక సిబ్బం పాల్గొన్నారు.

ప్రకటన

నా క్లయింట్లు కాకినాడ జిల్లా కాకినాడ డోర్‌నెం. 17-11-8/1, సాంబమూర్తినగర్ వాస్తవ్యులు **1) పరిమి రాముగారి కుమారుడు పరిమి సూర్యప్రకాష్ మరియు వారి భార్య 2) పరిమి కృష్ణవేణి గార్ల** తరపున ఈ ప్రకటని ఇవ్వడమైనది.

కాకినాడ జిల్లా, కాకినాడ జగన్నాధపురం, నరసింహారోడ్, డోర్‌నెం. 52-1-79గల స్థిరాస్తి రెండు అయిటములుగా 1) 174.20 చ॥గ॥లు మరియు 2) 75.80 చ॥గ॥లు మొత్తం 250.30 చ॥గ॥లు స్థలము ప్రస్తుతం రిడ్‌ఫుడ్ సిటీ U.S.Aలో నివాసం గల హరిదాసు వెంకన్న గారి కుమారుడు హరిదాసు శ్రీనివాస్‌గారికి గిఫ్ట్ సెటిల్‌మెంట్ దస్తావేజు నెం.10258/2012 మరియు క్రియదస్తావేజు, దస్తావేజు నెం. 786/2009 దఖలు పడి వారి స్వాధీనపు ఆస్తులై యున్నవి.

సదరు హరిదాసు శ్రీనివాస్‌గారి నుండి పైన పేర్కొన్న ఆస్తి మాక్లయింట్లు క్రియం పొందుటకు ఏర్పాటు చేసికొనియున్నారు. కావున పై ఆస్తి మాక్లయింట్లు క్రియం పొందుటకు ఎవ్వరికైనా అభ్యంతరములు, ఆక్షేపణలుయున్న ఈ ప్రకటన తేది నుండి 7 రోజుల్లోగా ఈ దిగువ చిరునామాదారునికి తెలుపగలరు. లేని యెడల సదరు ఆస్తి నిరభ్యంతర నిరాక్షేపణయని తలంచి మా క్లయింట్లు క్రియం పొందగలరు. తరువాత అభ్యంతరములు మా క్లయింట్లపై బైండు చేయనేరవు

N.V. హయగ్రీవరావు
K. శ్రీఅనుహిత,
అడ్వకేట్స్, 21-1-7, సాలిపేట, కాకినాడ-1, ఫోన్: 98495 99091
కాకినాడ
ది.8-10-24

ప్రకటన

నా క్లయింటు పెదపూడి మండలం, పెద్దాడ గ్రామ కాపురస్తులు **బొడ్డు (లేటు) భాస్కరరామారావు గారి భార్య జగన్మోహిని గారి** సంజాయిషీపై తెలియచేయునది ఏమనగా

ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్థి నా క్లయింటు వాటాకు, అనగా కాకినాడ 2వ అదనపు సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో O.S.No. 198/1979లో ఫైనల్ డిక్రీలో రాబడి, నా క్లయింటుకు స్వాధీనము కాబడి, నా క్లయింట్‌చే కాంపౌండ్ గోడ కట్టబడి, నా క్లయింటు యొక్క స్వాధీన, సంపూర్ణ హక్కు భుక్తములతో యుండియున్నది. సదరు ఆస్తిని గూర్చి నా క్లయింటు పరోక్షమున ఎవరు ఎటువంటి వ్యవహారములు జరిపినా చెల్లనేరవని అట్లు జరిపిన వ్యవహారములు నాక్లయింటును గాని, షెడ్యూల్ ఆస్తినిగాని ఎంత మాత్రము బైండ్ చేయజాలవని మరియు అట్లు జరిపిన వారు నష్టపోవుదరని ఇందుమూలముగా తెలియపరచటమైనది.

షెడ్యూలు

పూర్వము తూర్పుగోదావరి జిల్లా, ప్రస్తుతం కాకినాడ జిల్లా, కాకినాడ సిటీ, సూర్యారావుపేట, వార్డునెం.2, బ్లాక్‌నెం.8 T.S.No.43/2లో మొత్తం ఎ.0.95 సెంట్లలో పడమర వైపు రోడ్డులో పోగా మిగిలిన ఆస్థి ఈ దిగువ హద్దుల మధ్యస్తమైనది. **తూర్పు:** ఈ ఆస్థి తాలూకా కాంపౌండ్ గోడ అవతల N.F.C.L.వారి కాంపౌండు గోడ. **దక్షిణం :** ఈ ఆస్థి తాలూకా కాంపౌండ్ గోడ అవతల N.F.C.L. వారి కాంపౌండు గోడ. **పడమర :** ఈ ఆస్థి తాలూకా కాంపౌండ్ గోడ అవతల 100 అడుగుల పావురాల తూము రోడ్ **ఉత్తరం :** ఈ ఆస్థి తాలూకా కాంపౌండ్ గోడ అవతల D.S.P. గారి ఆస్థి.

పై ఆస్థి యావత్తు యాజిమెంటు హక్కులతో సహా.

కాకర వెంకటేశ్వరరావు, అడ్వకేట్,
డోర్‌నెం. 12-1-40, జవహర్ వీధి, కాకినాడ
ఫోన్: 0884-2367503, 98483 14081
కాకినాడ
ది.8-10-2024

నిధులు దుర్వినియోగంపై ఫిర్యాదు

గండేపల్లి, అక్టోబరు 8: మండలంలో ఉప్పలపాడు గ్రామ పంచాయతీలో నిధులు దుర్వినియోగంపై గ్రామానికి చెందిన మేడిబోయిన శ్రీను, సత్తి సోమరాజు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ ఉపాధి నిధులపై వివరాలు సేకరించగా పనులు చేయకుండా సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి డబ్బులు తీసుకున్నారని ఆరోపించారు. ఫిర్యాదు చేసిన వారిలో అడబాల సత్యనారాయణ, ఎస్.వెంకటరమణ ఉన్నారు.

అన్నవరం దేవస్థానానికి కొత్త బస్సులు

అన్నవరం అక్టోబరు 8: సుదూర ప్రాంతాల నుంచి రైలు, రోడ్డు మార్గాల్లో అన్నవరం చేరుకుని అక్కడి నుంచి కొండపైకి వెళ్లే భక్తుల సౌకర్యార్థం దేవస్థానం 2నూతన బస్సులు కొనుగోలు చేసింది. వీటిని మంగళవారం అన్నవరం దేవస్థానం గ్యారేజీకి చేర్చారు. రెండు బస్సులకు సుమారు రూ.85 లక్షలు వ్యయం అయినట్టు అధికారులు వెల్లడించారు. దేవస్థానంలో ప్రస్తుతం ఏడు బస్సులున్నాయి. వీటిలో రెండింటిని సత్యగిరి నుంచి రత్నగిరికి ఉచిత సర్వీసుగా తిప్పుతున్నారు. మిగిలిన ఐదింటిలో రెండు తరచూ మరమ్మతులకు గురవుతుండడంతో వాటి స్థానంలో నూతన బస్సులను అందుబాటులోకి తీసుకు రానున్నారు.

రైతు సంక్షేమమే లక్ష్యం


మాట్లాడుతున్న చింతమనీడి

తుని రూరల్, అక్టోబరు 8: రైతు సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని టీడీపీ సీనియర్ నేత, జాతీయ ఉత్తమ సర్పంచ్ అవార్డు గ్రహీత చింతమనేడి నాగ సోమరాజు (అబ్బాయి) స్పష్టం చేశారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని ఎస్.సురవరంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ సంబంధిత శాఖ యంత్రాంగ సూచనలను పాటిస్తే వ్యవసాయం లాభసాటిగా మారడం తథ్యమన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు అశోక్‌కుమార్, ఉద్యానవర శాఖ అధికారి విజయలక్ష్మి వ్యవసాయాన్ని లాభసాటి చేసే దిశగా రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు.

ఫుడ్ అండ్ సేఫ్టీ అధికారులు దాడులు

తుని రూరల్, అక్టోబరు 8: తేటగుంట హైవే హోటల్స్‌లో ఫుడ్ అండ్ సేఫ్టీ అధికారులు దాడులు నిర్వహించారు. ఫుడ్ ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు మాట్లాడుతూ ఆహార నాణ్యతా ప్రవాణాలకు ల్యాబ్‌కు తరలించనున్నట్లు తెలిపారు. నాణ్యతా ప్రమాణాలు పమాణాలను నిర్వాహకులు తూచతప్పకుండా పాటించాలని ఆయన ఆదేశించారు.

శ్రీ మహాలక్ష్మి దేవిగా తలుపులమ్మ



తుని రూరల్, అక్టోబరు 8: శరన్నవరాత్రి పర్వదినాలను పురస్కరించుకుని ప్రసిద్ధి పుణ్యక్షేత్రం లోవ దేవస్థానంలో తలుపులమ్మవారు శ్రీ మహాలక్ష్మీదేవిగా భక్తులను అనుగ్రహించారు. పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

రౌతులపూడిలో

రౌతులపూడి: గ్రామంలో కనకదుర్గమ్మవారు శ్రీ మహాలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దాతలు ఇచ్చిన కరెన్సీ నోట్లతో అమ్మవారిని అలంకరించారు.

రౌతులపూడి తహశీల్దార్ పోతురాజు

రౌతులపూడి, అక్టోబరు 8: రౌతులపూడి ఇన్‌చార్జ్ తహశీల్దార్‌గా ఎస్.పోతురాజు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు.

చోరీలు అరికట్టేందుకు ప్రజలు సహకరించాలి: ఎస్ఐ



గండేపల్లి, అక్టోబరు 8: ఈమధ్యకాలంలో వరుస చోరీలు జరగడంతో వాటిని అరికట్టేందుకు ప్రజలు కూడా సహకరించాలని గండేపల్లి ఎస్ఐ యువి శివనాగబాబు కోరారు. ఆయన మంగళవారం గండేపల్లి పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడుతూ దసరా పండుగకు ఊరెళ్లే వారు పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఇంట్లో నగదు, బంగా రు ఆభరణాలు ఇంట్లో ఉంచకుండా లాకర్లలో భద్రపరుచుకోవాలన్నారు. ఊరెళ్తున్న విషయాన్ని సోషల్ మీడియాలో పంచుకోవద్దన్నారు. ఊరెళ్లేటప్పుడు పోలీసులకు సమాచారం ఇస్తే ఎల్‌హెచ్ఎంఎస్ అమరుస్తామన్నారు. పోలీసు గస్తీ కూడా ఏర్పాటు చేస్తామని తెలిపారు.


బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

కాగితాలమ్మ బోనాల జాతర

తొండంగి, అక్టోబరు 8: బెండపూడి శివారు తమ్మయ్యపేట చినకాగాతాలమ్మవారి బోనాల జాతర మంగళవారం ఘనంగా జరిగింది. అమ్మవారి ఆలయం వద్ద గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున తరలి వచ్చిన ముత్తైదువలు ఎర్రని వస్త్రాలు ధరించి శిరస్సున బోనాలతో దీక్షగా భాజా భజంత్రీలు,గరగ నృత్యాల నడుమ ఊరేగింపుగా బెండపూడిలోని కాగితాలమ్మ చేరుకున్నారు. అమ్మవారిని హరితజలాలతో అభిషేకించి మొక్కులు చెల్లించుకున్నారు. టీడీపీ సీనియర్ నేత యనమల రాజేష్, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ సాధనాల నూకరాజు, బూసాల శ్రీను, బంటుపల్లి అన్వేష్, అరిగెల నర్సింహమూర్తి, జనసేన నాయకులు నాయుడు తదితరులు ప్రత్యేక పూజలు చేశారు.

ధనసత్తమ్మకు బోనాలు సమర్పణ

జగ్గంపేట, అక్టోబరు 8: స్థానిక శెట్టిబలిజపేటలోని రామకోవెల వద్ద కనకదుర్గ మండపం నుంచి జగ్గంపేట పొలాల్లో ఉన్న ధనసత్తమ్మ ఆలయం వరకు మంగళవారం వందలాది మహిళలు, భవానీలు ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. రాష్ట్ర టీడీపీ కార్యదర్శి ఎస్‌వీఎస్ అప్పలరాజు అమ్మవారిని దర్శించుకున్నారు.